




అంగన్‌వాడీ టీచర్‌తో మాట్లాడుతున్న కలెక్టర్



భద్రకాళి చెరువు చుట్టూ నిర్మాణాలు

కబ్జా పర్వం- 2

చెరువులను చెరపట్టారు!

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

కాకతీయుల కాలంలో వరంగల్ నగరంలో నిర్మించిన గొలుసుకట్టు చెరువుల చరిత్ర చెరిగిపోతుంది. కబ్జా కోరల్లో చిక్కి తల్లడిల్లుతున్నాయి. రియల్టర్లు, నేతల స్వార్థపూరిత ఆలోచనలకు తటాకాలు అవిరైపోతున్నాయి. వరంగల్ మహానగరంలో 170కి పైగా చెరువులు, కుంటలు ఉండగా, వీటిలో సగం మాయం కాగా, మిగిలి ఉన్న చెరువులు, కుంటల్లో దర్జాగా కబ్జాలు చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టారు. నగరంలోని చారిత్రత్మక భద్రకాళి చెరువుతో పాటు బంధం చెరువు, వడ్డేపల్లి చెరువు, కోట చెరువుల్లోనే ఏకంగా 1,094 అక్రమ నిర్మాణాలను చేపట్టారు. ఇవే కాకుండా మిగతా చెరువుల, కుంటల్లో వందలాది ఎకరాల్లో వేలాది అక్రమ నిర్మాణాలతో వేల కోట్ల విలువైన భూముల్లో షాపింగ్ మాల్స్, ఫంక్షన్‌హాళ్లు, విద్యాసంస్థలు, అపార్ట్‌మెంట్లతో పాటు దర్జాగా వెంచర్లతో కబ్జారాయుళ్లు తిష్టవేశారు. ఇంతా జరుగుతున్న అధికారులు మాత్రం అక్రమాల వైపు కన్నెత్తి చూడకపోవడానికి ప్రధానకారణం నేతలు, ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లే కారణమనే ప్రచారం జరుగుతోంది.

నగరంలో 170 చెరువులు, కుంటలు

కాకతీయరాజులు తమ పాలనలో వరంగల్ మహానగరంలో భారీగా గొలుసుకట్టు చెరువులు, కుంటలను ఏర్పాటు చేశారు. రాజధాని ప్రజలకు సాగు, తాగు నీటికి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు ముందస్తుగా భారీగా జలాశయాలను తవ్వించారు. వరంగల్ నగరంలో ఇటీవల కాలంలో చుట్టు పక్కల గ్రామాలు విలీనం కావటంతో గ్రేటర్ వరంగల్ పరిధి మరింత పెరిగింది. గ్రేటర్ పరిధిలో 55 చెరువులు, 115కుంటలు, చిన్నచిన్న జలాశయాలున్నాయి. ఇవన్నీ కూడా నగరం విస్తరణ పరిసర ప్రాంతాల్లోనే ఉన్నాయి. చాలా చెరువుల కింద సాగు తగ్గి, వ్యవసాయేతర భూములుగా మారాయి. దీంతో చెరువుల శిఖం భూములు, చెరువుల కట్టల భూములపై కబ్జారాయుళ్ల కన్నుపడింది. ఎక్కడిక్కడ ఖాళీ జాగ కనిపిస్తే చాలు కబ్జాలు చేస్తు అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్నారు.

నగరంలోని చెరువుల్లో అక్రమాలు ఇలా..

చెరువు	అక్రమ నిర్మాణాలు	కూల్చి వేసినవి	నోటీసులు ఇచ్చినవి
భద్రకాళి చెరువు	249	108	91
చిన్నవడ్డేపల్లి చెరువు	329	08	110
బంధం చెరువు	366	07	125
కోట చెరువు	150	04	50
మొత్తం	1,094	127	376



కాజీపేట బంధం చెరువును ఆనుకుని నిర్మించిన భవనాలు

- చెరిగిపోతున్న కాకతీయుల నాటి 'గొలుసుకట్టు' చరిత్ర
- నగరంలో 170కిపైగా చెరువులు, కుంటల భూముల అక్రమణ
- భద్రకాళి, కోటచెరువు, వడ్డేపల్లి, బంధం తతాకాలను ఆనుకుని 1,094 అక్రమ కట్టడాలు
- వేల కోట్ల విలువైన వందల ఎకరాలు హాంఫట్
- రియల్టర్లు, నేతల కనుసన్నల్లో యథేచ్ఛగా నిర్మాణాలు
- నగర శివారు గ్రామాల్లోనూ కబ్జా కోరుల కన్ను

170
ఆక్రమణకు గురైన చెరువులు, కుంటలు

1094
చెరువులు, కుంటలను ఆనుకుని నిర్మించిన అక్రమ కట్టడాలు


ఆక్రమణలపై మౌనమేల?

గ్రేటర్ వరంగల్ పరిధిలో చెరువుల, కుంటల శిఖం భూముల్లో తిష్ట వేసిన.. వేస్తున్న అక్రమా ర్కులకు అధికారులు నామ మాత్రంగా నోటిసు లు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నాలాల కబ్జాలతో పాటు చెరువు అక్రమ ణలపై కూడా అధికారు లది 'మౌనమే తమ మాట' అనే చందంగా ఉంద న్న ఆగ్రహం వ్యక్తమవుతోంది. బల్దియాలోని కొందరు అధికారులు, ప్రజాప్రతినిధులు కబ్జాకో రులకు సహకరించేలా వ్యవహరించటమే కాకుండా కోర్టుకు వెళ్లేలా ప్రోత్సాహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో టౌన్ ప్లానింగ్‌లో పని చేసి బదిలీపై వెళ్లిన ఓ అధికారి కనుసన్నుల్లో భారీగా అక్రమ కట్టడాలకు అనుమ తులు ఇచ్చారనే ప్రచారం జరుగుతుంది. నగరం లో వేల కోట్ల విలువైన భూములను కాపాడేందు కు నగర పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎంపీ, కలెక్టర్లు రంగంలోకి దిగితేనే కబ్జాల చెర నుంచి చెరువులకు విముక్తి కలుగుతుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

చెరువు భూముల్లో దర్జాగా కబ్జాలు

నగరంలో భూములకు ధరలు పెరిగిపోవటంతో పాటు నగర నడిబొడ్డున నివాస యోగ్యమైన భూములు, వ్యాపారానికి అనుకూలమైన భూముల కొరత ఉండటంతో కబ్జారాయుళ్ల కళ్లు చెరువు భూములపై పడ్డాయి. ప్రధానంగా నగరంలో భద్రకాళి చెరువు 495.89ఎకరాల్లో విస్తరించింది. నగరం నడిబొడ్డున ఉండటంతో చెరువు నలుదిక్కుల ఖాళీ జాగా లేకుండా అక్రమించారు. 70ఎకరాల వరకు భూమి అక్రమణకు గురైందని ఫిర్యాదులు వస్తున్న అధికారులు దృష్టి పెట్టడం లేదనే ఆరోపణలున్నాయి. ఈ భద్రకాళి చెరువులో 249 అక్రమ కట్టడాలను నిర్మించారు. వందల కోట్ల విలువైన భూముల్లో అక్రమార్కులు పాగా వేశారని అధికారులు గుర్తించి, వీటిలో 108 అక్రమ కట్టడాలను ఇటీవల కూల్చి వేయగా, 91కట్టడాలకు నోటీసులు ఇచ్చారు. 28 అక్రమ కట్టడాలు చెరువులోనే మునిగిపోయాయి. అధికారులు గుర్తించని అక్రమ నిర్మాణాలతో పాటు మరికొన్నింటిపై రాజకీయ ఒత్తిళ్లు అధికంగా ఉండటంతో అధికారులు వెనుక్కి తగ్గారనే చర్చ జరుగుతుండగా,

మిగతా 8వ పేజీలో..



వరంగల్ పరిధిలోని శాకరాసికుంట చుట్టూ పరిస్థితి..

అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ ప్రైమరీ విద్య

- మోడల్ కేంద్రంగా హర్యాతండా
- 9న సీఎం ప్రారంభించే అవకాశం : కలెక్టర్

గీసుగొండ, సెప్టెంబరు 5: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ ప్రైమరీ విద్యను ప్రభుత్వం ప్రవేశపెడుతోందని, హర్యాతండా అంగన్‌వాడీ కేంద్రాన్ని మోడల్‌గా ఎంపిక చేసినట్లు కలెక్టర్ సత్యశారద వెల్లడించారు. గురువారం మండలంలోని హర్యాతండా అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 9న సీఎం పర్యటనలో ప్రీ ప్రైమరీ విద్యను అంగన్‌వాడీ సెంటర్‌లో ప్రారంభించే అవకాశం ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమశాఖ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ ఆకేశ్వర్‌రావు, పోషణ అభియాన్ స్టేట్ కన్సల్టెంట్ శివాల్కర్, జిల్లా సంక్షేమాధికారి హైమావతి, సీడీపీవోలు విశ్వజ, డేబోర, తహసీల్దార్ రియాజుద్దీన్, ఎంపీడీవో కమలాకర్, ఆర్ఐ సాంబయ్య పాల్గొన్నారు.

'రెవెన్యూ చట్టం'పై కలెక్టర్‌ను కలిసిన రైతు సంఘం

వరంగల్ కలెక్టరేట్: నూతన రెవెన్యూ చట్టం రైతులకు ఉపయోగపడే విధంగా ఉండాలని తెలంగాణ రైతు సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ నేతలు గురువారం కలెక్టర్ సత్యశారదకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముసాయిదా నూతన రెవెన్యూ చట్టం 2024 వరంగల్ జిల్లాలో రైతుల భూమి రికార్డు సమస్యలు గురించి కొన్ని సంవత్సరాలుగా ఇబ్బందిపడుతున్న రైతాంగాన్ని, గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణిని సవరించి భూమి మోకా మీద ఉన్న యాజమాన్యంను గుర్తించాలన్నారు. సాదాబైనామా సమస్యలను గుర్తించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య, జిల్లా కోశాధికారి సిర్ల రవీందర్, జిల్లా కమిటీ సభ్యులు జెండా అంబయ్య పాల్గొన్నారు.

వరంగల్ మీదుగా పాక్షికంగా నడిచిన రైళ్లు

వివరాలు : 7లో..



వరంగల్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న బీజేపీ మహిళా మోర్చా నాయకులు

అత్యాచారం చేసిన వ్యక్తిని ఉరి తీయాలి

మిల్స్‌కాలనీ, సెప్టెంబరు 5: కొమురంభీం ఆసీఫాబాద్ జిల్లా జైనూర్ మండలానికి చెందిన ఆదివాసీ మహిళపై అత్యాచారం చేసిన నిందితుడిని ఉరి తీయాలని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కాసు శిల్ప డిమాండ్ చేశారు. అఘాయిత్యానికి నిరసనగా గురువారం వరంగల్ చౌరస్తాలో మహిళా మోర్చా ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. శిల్ప మాట్లాడుతూ నిందితుడిపై వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, మరణశిక్షను వేయాలని, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలన్నారు. తెలంగాణలో ఆడబిడ్డలకు రక్షణ కరువైందని, ప్రభుత్వం చేతకాని తనంతోనే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని మండిపడ్డారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ మాట్లాడుతూ... ప్రభుత్వం వెంటనే స్పందించి బాధితులకు తగిన న్యాయం చేయాలన్నారు. మహిళా మోర్చా నాయకులు బండి సుజాత, ఎస్.సరిత, అపర్ణ, స్వర్ణజ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్‌సా, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లాడి తిరుపతిరెడ్డి, బైరి శ్యాంసుందర్, కూచన క్రాంతికుమార్, మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గోవింద్ సింగ్ పాల్గొన్నారు.

మార్కెట్ ఫీజు వసూళ్లలో నిర్లక్ష్యం తగదు

- ఏనుమాముల మార్కెట్ పర్సన్ ఇన్‌చార్జ్ శ్రీనివాస్

వరంగల్ వ్యవసాయం, సెప్టెంబరు 5: మార్కెట్ ఫీజు వసూళ్లలో నిర్లక్ష్యం వహించవద్దని మార్కెటింగ్‌శాఖ జాయింట్ డైరెక్టర్, ఏనుమాముల మార్కెట్ పర్సన్ ఇన్‌చార్జి ఉప్పుల శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. గురువారం ఏను మాముల వ్యవసాయ మార్కెట్లో ఆ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలె పాక నిర్మల అధ్యక్షతన సమీక్షా సమావేశం జరిగింది. శ్రీనివాస్‌తోపాటు డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి హాజరయ్యారు. ఈసందర్భంగా మార్కెట్లోని అన్ని యార్డుల ఇన్‌చార్జీలతో క్రయవిక్రయాలు, మార్కెట్ ఫీజు వసూలు, శానిటేషన్ పనితీరు తదితర అంశాలపై శ్రీనివాస్ సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గ్రేడ్ 2 కార్యదర్శులు రామోజు రాము, అజిత్‌రావు, సురేఖ, రాజేం దర్, గంగాధర్, నర్సింహ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

టీచర్స్ ఫ్రెండ్లీ గవర్నమెంట్

- విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికి తీసేది ఉపాధ్యాయులే
- గురుపూజోత్సవంలో ఎంపీ కడియం కావ్య
- 60 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారం





మాట్లాడుతున్న ఎంపీ కావ్య, ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం పొందిన టీచర్లు

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 5: ఎంతోకాలంగా ఉపాధ్యాయులు ఎదురుచూసిన బదిలీలు, పదోన్నతులను చేపట్టి టీచర్స్ ఫ్రెండ్లీ గవర్నమెంట్‌గా మారిందని వరంగల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కడియం కావ్య అన్నారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం వరంగల్ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన గురుపూజోత్సవానికి ఎంపీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. హంటర్‌రోడ్ ఉర్సుగుట్ట వద్దనున్న ఆకుతోట కన్వెన్షన్‌లో డీఈవో మామిడి జ్ఞానేశ్వర్ అధ్యక్షతన నిర్వహించిన గురుపూజోత్సవంలో ముందుగా ఆహుతులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వళన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా కావ్య మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజంలో అత్యంత గౌరవ స్థానాన్ని పొందుతున్నారన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను గుర్తించేది ఉపాధ్యాయులేనన్నారు. వాటికి అనుగుణంగా విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారిని ఉన్నత శిఖరాలకు చేర్చాల్సిన బాధ్యతను గురువులే తీసుకోవాలని కోరారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధితోపాటు సమాజోద్ధరణ ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతీ విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. విద్యారంగంలో జిల్లాను ముందంజలో ఉంచాలని, అందుకు ప్రభుత్వంతో పాటు ప్రజాప్రనిధులందరి సహకారం ఉంటుందన్నారు.

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉపాధ్యాయులంతా సంతోషంగా ఉన్నారన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా జరిగాయన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దుతారని, అందుకు తన జీవితమే ఉదాహరణగా చెప్పుకొచ్చారు. తాను డాక్టర్‌ను అవుతానని అనుకొన్నానని, అయితే నాలోని నైపుణ్యాన్ని గుర్తించిన కొమురెల్లి అనే డ్రిల్లు మాస్టర్ తనను జాతీయ స్థాయి హాకీ క్రీడాకారుడిగా తయారు చేశాడన్నారు.

పరకాల ఎమ్మెల్యే రేమూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుడి నీడలోనే విద్యార్థి అభివృద్ధి పథంలో ఎదుగుతారన్నారు. భారత రాష్ట్రపతిగా పనిచేసిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ తన పుట్టిన రోజును జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవాలన్నారని, అత్యంత ఉన్నత పదవిని సైతం లెక్కచేయకుండా ఉపాధ్యాయ వృత్తికే ఆయన ఎంత గౌరవం ఇచ్చారన్నారు. ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుందన్నారు. అయితే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే కాకుండా మనందరిపై ఉందన్నారు.

ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మాట్లాడుతూ సమాజంలో గురువులకు ప్రత్యేక స్థానం ఉందని, వారే సమాజానికి మార్గనిర్దేశకులని కొనియాడారు. కాలం మారినా, సమాజం మారినా, టెక్నాలజీలో ఎంత ఎత్తుకు ఎదిగినా ఉపాధ్యాయుడి గౌరవం చిరకాలం అలాగే ఉంటుందన్నారు.

డీఈవో జ్ఞానేశ్వర్ అధ్యక్షోపాన్యాసం జిల్లాలో విద్యారంగ అభివృద్ధిని వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వినియోగించుకుంటూ ప్రతీ సంక్షేమ పథకం ప్రభుత్వ పాఠశాలకు చేరేలా తాము పాటుపడుతున్నామన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం..

గురుపూజోత్సవం సందర్భంగా జిల్లాలో ఎంపికైన 60మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ప్రశంసా పత్రం, శాలువా, జ్ఞాపికతో ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణి, సెక్టోరల్ అధికారులు ఫ్లోరెన్స్, సుభాష్, సుజన్‌తేజ, స్థానిక కార్పొరేటర్ పల్లం పద్మ, ఎంఈవోలు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు పాల్గొన్నారు.



చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన

ఎరుపెక్కిన టేకులగూడెం

- ముగిసిన మావోయిస్టు నేత మాచర్ల ఏసోబు అంత్యక్రియలు
- అంతిమయాత్రకు హాజరైన ప్రజా, పౌర సంఘాల నాయకులు





అంతిమయాత్రలో పాల్గొన్న ప్రజలు, రోదిస్తున్న ఏసోబు కుటుంబ సభ్యులు

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ

బయ్యారం, సెప్టెంబరు 5 : వరద బాధితులకు గురువారం పోలీసులు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. విస్తారంగా కురుస్తున్న వర్షాలకు మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలోని వట్టివాగు ప్రవాహంతో మొట్లతిమ్మాపురం గ్రామానికి వారం రోజులుగా రాకపోకలు నిలిచిపోయిన సంగతి తెలిసిందే. దీంతో ఎస్పీ ఎస్పీ సుధీర్‌రామ్ నాథ్ కేకన్ ఆదేశాలతో మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతి నేతృత్వంలో బయ్యారం సీఐ రవికుమార్, ఎస్సై తిరుపతితో పాటు పోలీస్ సిబ్బంది జేసీబీ వాహనం ద్వారా వాగుదాటి మొట్లతిమ్మాపురం గ్రామ ప్రజలకు నిత్యావసర సరుకులు, కురగాయలు పంపిణీ చేశారు. దాదాపు ఒక ట్రాక్టర్ నిండా సరుకులు తీసుకెళ్లి గ్రామ ప్రజలకు అందజేశారు. కొద్ది రోజులుగా తాము పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పోలీసులు సరుకులు పంపిణీ చేయడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది అనిల్, సతీష్, రజిని, కోటేశ్వర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



బయ్యారంలో బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న పోలీసులు



వరంగల్ పోతననగర్‌లోని మోడ్రన్ దోబీఘాట్



వాషింగ్ మిషన్లు, ఐరన్ బాక్స్ టేబుళ్లు

మోడ్రన్ దోబీఘాట్‌పై పట్టింపేదీ?

- నిరుపయోగంగా పోతననగర్ దోబీఘాట్
- కోట్లు ఖర్చు చేసినా ఫలితం శూన్యం
- నిరుపయోగంగా విలువైన సామగ్రి
- ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపం
- నిర్వహణ బాధ్యతపై ఎటూ తేల్చని అధికారులు
- రజక సంఘాలకు అప్పగించాలని డిమాండ్



ల్యాండ్రోమార్ట్ పనులను ప్రారంభిస్తున్న కేటీఆర్, అధికారులు (ఫైల్)

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 5: అట్టహాసంగా ప్రారంభించిన వరంగల్ మోడ్రన్ దోబీఘాట్(ల్యాండ్రో మార్ట్) పది నెలలకే పనులకు నోచుకోకుండా పోయింది. పనులు మొత్తం పూర్తయినా బల్దియా, బీసీ వెల్ఫేర్ శాఖల మధ్య నెలకొన్న సమన్వయ లోపంతో ఎక్కడి పనులక్కడే అన్నట్టు విమర్శలు వస్తున్నాయి.

అధునాతన రీతిలో..

వరంగల్ పోతననగర్‌లో ఏర్పాటు చేసిన మోడ్రన్ దోబీఘాట్ అధునాతన సాంకేతికతతో రూపుదిద్దుకుంది. స్మార్ట్‌సిటీ నిధుల కింద ముందుగా రూ.1.10 కోట్లు మంజూరు చేయగా, తర్వాత మరో రూ.కోటితో షెడ్డుతో పాటు అక్కడ అన్ని సౌకర్యాలు, ప్రత్యేక పవర్ ట్రాన్స్‌ఫార్మ్‌ను ఏర్పాటు చేశారు. పోతననగర్‌లో ఏర్పాటు చేసిన మోడ్రన్ దోబీఘాట్‌కు ఇప్పటి వరకు రూ.2.50 కోట్ల వరకు ఖర్చు చేసినట్టు బల్దియా అధికారులు వెల్లడించారు. అందులో 30కిలోల వాషింగ్ మిషన్లు 9, 15కిలోల స్పిన్ మిషన్లు 9, 30కిలోల డ్రై మిషన్లు 12, 10 టేబుళ్లపై ఆర్‌వో స్ట్రీం వాటర్ టెక్నాలజీతో నడిచే 10 ఐరన్ బాక్సులతో పాటు పెద్ద పెద్ద టబ్బులు, కెమికల్ స్టోరేజ్ మిషన్లను ఏర్పాటు చేశారు. ఇంకా మోడ్రన్ దోబీ మిషన్లు, శారీ రోలింగ్ మిషన్లు, బెట్‌షీట్ ఏరస్ మిషన్లు ఏర్పాటు చేశారు. ఈ మిషన్ల ద్వారా డ్రైక్లీనింగ్, డ్రైవాష్, స్ట్రీం ఐరన్ వాష్, నార్మల్ వాష్, స్పిన్ వాష్, కెమికల్ వాష్, నాచురల్ వాష్‌ల పద్ధతిలో అన్ని రకాల బట్టలు శుభ్రం చేయవచ్చని తెలిపారు.

ఏకతాటిపైకి కుల సంఘం నాయకులు

వరంగల్ నగరంలో రజకుల అభివృద్ధి కోసం మోడ్రన్ దోబీఘాట్ ఏర్పాటు చేస్తున్నారని, ఇందులో రజకులైన ప్రతీ ఒక్కరు సభ్యులుగా ఉండవచ్చని ప్రజా ప్రతినిధులు, సంఘం నాయకులు తెలిపారు. ముందుగా ప్రాంతాల వారీగా ఉన్న రజక సంఘాల నాయకులను ఏక తాటిపైకి తెచ్చి తర్వాత వరంగల్ ట్రైసిటీస్ సమావేశం ఏర్పాటు చేశారు. సుమారు 500 నుంచి 600 మంది వరకు సభ్యులుగా చేర్చుకుని మడేలయ్య మోడ్రన్ దోబీఘాట్ సొసైటీగా ఏర్పడ్డారు. ప్రత్యేక వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసుకుని ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఒకరికొకరు చేరవేసుకుంటున్నారు. బస్వరాజు సారయ్యను సంఘానికి ముఖ్య సలహాదారుడిగా చేసుకుని, ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఉన్న సంఘాల నుంచి ఇద్దరు, ముగ్గురి చొప్పున తీసుకుని పెద్ద సంఘంగా ఏర్పడ్డారు. అయితే వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లో నివసించే రజక కార్మికులు.. చేసిన పనికి తీసుకునే ధరలు విషయంలో కొంత వ్యత్యాసం ఉండడంతో కొందరు వెనక్కి తగ్గినట్టు ప్రచారం జరుగుతోంది. దీంతో అధికారులు సైతం ముందుకు రావడం లేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదంతా పక్కన పెడితే తక్కువ సమయంలో ఎక్కువ బట్టలు ఉతకడం, ఇస్త్రీ చేయడం, డ్రైక్లీనింగ్‌తో రజకులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అట్టహాసంగా..

2021లో వరంగల్ నగరంలో మోడ్రన్ దోబీఘాట్‌నే ఏర్పాటు చేసేందుకు సంఘం ప్రతినిధులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. 2022లో పనులు ప్రారంభమయ్యాయి. స్మార్ట్‌సిటీ ప్రత్యేక నిధులతో వరంగల్ పోతననగర్‌లో ల్యాండ్రో మార్ట్ (దోబీఘాట్) పనులు పూర్తి చేశారు. కాగా, పోతననగర్‌లోని దోబీఘాట్‌తో పాటు అలంకార్ జంక్షన్‌లో అభివృద్ధి పనులు, పాత సెంట్రల్ జైలు ముందు లైబ్రరీ, చెత్త ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లను 2023 అక్టోబరు 6న అప్పటి ఐటీ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించారు. దోబీ కుల సంఘాల నాయకులు, కార్మికులను పిలిచి ఎక్స్‌పర్ట్స్ ట్రయల్ రన్ కూడా చేశారు. కానీ దోబీల ఆనందం ఎంతో సేపు ఉండలేకపోయింది. అదే రోజు వేసిన తాళం ఇప్పటికీ తెరుచుకోలేదు. బల్దియా, బీసీ వెల్ఫేర్ శాఖల మధ్య సమన్వయం లేకపోవడం కుల సంఘం నాయకులు నిర్లక్ష్యం చేయడం వల్లనే ఇప్పటి వరకు అందుబాటులోకి రాలేదని ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో రజకులకు ప్రత్యేక రుణాలు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తించి దోబీఘాట్ పనులు అప్పగించాలని సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. ఇంకా ప్రభుత్వ వసతి గృహాలు, ఆస్పత్రులు, స్కూళ్లు, రెస్టారెంట్ల బట్టలు కూడా కాంట్రాక్ట్ పద్ధతిలో ఇక్కడే ఉతికేందుకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. రజకుల్లో చాలామంది పెద్ద పెద్ద చదువులు చదివిన వారు నిరుద్యోగులుగా ఉన్నారని ఇక్కడ సుమారు 200 మందికి రెండు షిఫ్టులలో పనికల్పించి ఉపాధి అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అయితే సులువుగా విలువైన బట్టలు ఉతికే దోబీ ఘాట్ సామగ్రి శిథిలావస్థకు చేరుకుంటుందని రజక సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజుకు లక్షల రూపాయలు సంపాదించి పెట్టే పరికరాలు తుప్పుపట్టి పనికి రాకుండా పోయే పరిస్థితి ఉందని, బల్దియా అధికారులు బీసీ వెల్ఫేర్ అధికారులను పిలిచి త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని రజక సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

భార్య కాపురానికి రావడం లేదని యువకుడి ఆత్మహత్య

తొర్రూరు, సెప్టెంబరు 5 : భార్య కాపురానికి రావడం లేదని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం తొర్రూరులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం... దంతాలపల్లి మండలం గున్నెపల్లికి చెందిన ఎస్.కె. షరీఫ్(28) తొర్రూరులో వెల్డింగ్ షాపులో కూలీ పనిచేస్తూ నివసిస్తున్నాడు. అతడికి ఇద్దరు కమార్తెలు. మద్యానికి బానిసై తిరుగుతుండడంతో పది రోజుల క్రితం భార్య పుట్టింటికి వెళ్లిపోగా మనస్థాపానికి గురై ఉరివేసుకొని చనిపోయాడు. తండ్రి జానీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి ట్రాక్టర్ డ్రైవర్..

డోర్నకల్, సెప్టెంబరు 5 : పురుగుల మందు తాగిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన డోర్నకల్ మండలం తోడేళ్లగూడెం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం. తోడేళ్లగూడెంకు చెందిన దండుగుల వెంకన్న (45) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గత కొంత కాలంగా వెంకన్న మద్యానికి బానిసయ్యాడు. దీంతో అయన భార్య ఎల్లమ్మ ఈనెల 4న అతన్ని మందలించడంతో ఇరువురి మధ్య వాగ్వావాదం చోటు చేసుకుంది. దీంతో మనస్తాపానికి గురైన వెంకన్న పురుగుల మందు తాగాడు. ఇది గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం మహబూబాబాద్ జిల్లా అస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వెంకన్న మృతి చెందాడు. మృతుడికి భార్య ఎల్లమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుని తండ్రి నాగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మానుకోట పట్టణంలో భారీ చోరీ

- 12 తులాల బంగారం, 80 తులాల వెండి ఆభరణాలు, రూ.2లక్షల నగదు అపహరించిన దుండగులు

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 5: జిల్లాకేంద్రంలో బుధవారం భారీ చోరీ జరిగి 12 తులాల బంగారం, 80 తులాల వెండి ఆభరణాలతో పాటు రూ.2 లక్షల నగదు గుర్తు తెలియని దుండగులు అపహరించుకుపోయిన సంఘటన చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం. మహబూబాబాద్ పట్టణం శివారు కంకరమిల్లు సమీపంలో కాలనీకి చెందిన కాసోజు బ్రహ్మచారి పురోహితుడిగా చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నట్లు చెప్పారు. తన భార్య అశ్వినికి ఆరోగ్యం బాగోలేకపోవడంతో చికిత్స నిమిత్తం గత శుక్రవారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లానని, వర్షాలు రావడంతో మహబూబాబాద్‌కు రాకపోకలు బంద్ కావడంతో హైదరాబాద్‌లోనే ఉన్నట్లు చెప్పారు. బుధవారం సాయంత్రం తనభార్య అశ్విని తీసుకుని ఇంటికి వచ్చానని ఇంటికి వేసిన తాళం పగులగొట్టి ఉండడంతో ఇంట్లోకి వెళ్లి చూసినట్లు చెప్పారు. బీరువాలో ఉన్న 12 తులాల బంగారం, 80 తులాల వెండి అభరణాలతో పాటు రూ.2. లక్షల నగదు కన్పించకపోవడంతో ఈ విషయాన్ని వెంటనే టౌన్ పోలీసులకు సమాచారం అందించినట్లు చెప్పారు. ఘటన స్థలానికి క్లూజ్‌టీం సభ్యులు చేరుకుని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. ఆపై వేలిముద్రలను సేకరించారు. ఈ విషయంపై బాధితుడు బ్రహ్మచారి టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

వరహాల గుట్టకు మహర్దశ

- ముులుగు జిల్లాలో మరో పర్యాటక కేంద్రంగా అభివృద్ధి
- కాకతీయుల కాలం నాటి కట్టడాల గుర్తింపు
- త్వరలో గుట్టపై 40 గుడారాలు.. క్రాఫ్ట్ ఫైర్ ఏర్పాటు
- రామప్ప సరస్సుకు కూతవేటు దూరంలో కొత్త శోభ

వెంకటాపూర్(రామప్ప), సెప్టెంబరు 5: కాకతీయుల కాలంనాటి రహస్య గుట్ట.. అక్కడ వజ్ర వైడూర్యాలు ఉన్నాయా? లేదంటే కాకతీయుల కాలంనాటి రహస్య స్థావరం ఉందా? రాజులుదాచిన ఖజానా ఏమైనా ఉందా? అనే ప్రశ్నలతో పాటు మేడారం సమ్మక్క-సారలమ్మలతో యుద్ధం జరిగిన సమయంలో కాకతీయ రాజులు ఇక్కడే సేద తీరినట్లు చెబుతుంటారు. ఇలా ఎన్నో అంతుచిక్కని ప్రశ్నలు దశాబ్దాలుగా ఆ గుట్టచుట్టు తిరుగుతూనే ఉన్నాయి. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని రామప్ప సరస్సుకు కూతవేటు దూరంలో కనిపించే ఆ కొండపైకి ఎక్కడానికి ఈ తరం వారెవరూ అంతగా ఆసక్తి చూపరు. కానీ పైకి ఎక్కిచూస్తే చుట్టుపక్కల గ్రామాలన్నీ కనిపిస్తాయని చరిత్రకారులు చెబుతున్నారు. కాకతీయుల కాలంలో ఎడ్లబండ్లపై గుట్టపైకి వెళ్ళినట్లు ఇటీవల గుర్తించిన పలు ఆనవాళ్ల ద్వారా తెలుస్తోంది. ప్రస్తుతం ఆ గుట్టపైకి ఎక్కాలంటే నడవాల్సిందే. కాకతీయుల కాలంలో రామప్ప సరస్సు అయకట్టు కింద కాకతీయ రాజులు తాము పండించిన ధాన్యం బందిపోట్లు లాక్కెళుతున్నారని, ధాన్యం రక్షణ కోసం గుట్టపై రహస్య స్థావరం ఏర్పరిచినట్లు కథనం ప్రకచారంలో ఉంది. దీనికి తగ్గట్లే ధాన్యం ఆరబోసేందుకు ఓ కల్లం ఏర్పాటు చేసిన ఆనవాళ్లు కూడా ఉన్నాయి.


కాకతీయుల కాలంలో ఏర్పాటు చేసిన రాళ్లగోడ

గుట్టపై భారీ రాళ్ల గోడ

సుమారు ఐదు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న వరహాల గుట్ట పైభాగంలో రాళ్లతో భారీ ప్రహరీ నిర్మించారు. తాగునీటి బావి, పచ్చళ్లు నూరడానికి రోళ్లు, బండి చక్రాలు నడిచిన ఆనవాళ్లున్నట్లు చరిత్రకారులు చెబుతున్నారు. శిథిలమైన ఓ వినాయకుడి విగ్రహం కూడా గుట్టపై లభ్యమైనట్లు తెలుస్తోంది. హిందూ సంప్రదాయం ప్రకారం మొదటి పూజ వినాయకుడికి చేస్తాం కాబట్టి కాకతీ యులు కూడా ఇదే సంప్రదాయాన్ని పాటిస్తూ గుట్ట ప్రారంభ దారిలోనే వినాయకుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించినట్లు భావిస్తున్నారు. అంతే కాకుండా అంత ఎత్తులో ఉన్న గుట్టపై బావి నిర్మించి నీటిని తోడుకున్నారంటే చాలా కాలం ఇక్కడ నివసించి ఉన్నారని అర్థం చేసుకోవచ్చని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఇది నిర్మించింది కూడా రేచర్లే!

కాకతీయు సేనాని రేచర్ల రుద్రయ్య రామప్ప దేవాయాన్ని నిర్మించినట్లు చరిత్ర ద్వారా తెలుస్తుండగా అదేవిధంగా వరహాల గ్టుపై కాకతీయుల ఉన్నట్లు వారి అవసరాల కోసం అక్కడ అన్నీ నిర్మాణాలు చేసినట్లు భావిస్తున్నారు. కొందరు సైనిక స్థావరం కోసమని, మరికొందరు విలువైన సంపద, ఖజానా దాచుకోవడం కోసమని, ఇంకొందరు సమ్మక్క-సారక్కలతో యుద్ధం జరిగిన సమయంలో రాజులు సేద తీరడాకని, విలువైన ఆభరణాలు, ధాన్యం దాచుకోవడానికని గుట్టపై ఏర్పాట్లు చేసుకున్నారని చెబుతున్నారు. అందువల్లే ఈగుట్టకు వరహాలగుట్ట అనే పేరు వచ్చిందని భావిస్తున్నారు. కాకతీయలు నిర్మించిన ఈగుట్ట పైభాగంలో ఉన్న పురాతన సంపదనను కాపాడటంతో పాటు పర్యాటకులకు ఈ అందాలు, కాకతీయుల కాలం నాటి గుర్తులను చేరువ చేసేలా అభివృద్ధి చేయనున్నట్లు సమాచారం. మరో నెలరోజుల్లో ఈ గట్టుకు మహర్దశ వచ్చేలా చర్యలు తీసుకోబోతున్నట్లు తెలుస్తోంది.

గుట్టపై ప్రదేశంలో పర్యాటకుల కోసం గుడారాలు

అటవీశాఖ ఆధ్వర్యంలో రామప్ప సరస్సు సమీపంలో ఉన్న వరహాలగుట్టపై ఉన్న ఐదెకరాల ప్రదేశాన్ని పర్యాటక కేంద్రంగా తయారు చేసేందుకు ములుగు అటవీశాఖ అధికారి (డీఎఫ్‌వో) ఆదేశాలతో ములుగు ఫారెస్ట్ రెంజర్ డోలి శంకర్ ఆధ్వర్యంలో పర్యాటకులను ఆకర్శించే విధంగా పనులు మొదలయ్యాయి. ఈ నెలాఖరు కల్లా గుట్టపైకి పర్యాటకులను అనుమతించే అవకాశం కనిపిస్తోంది. అయితే కాలినడకన వెళ్లేందుకు మూడు మీటర్ల వెడల్పుతో గుట్టకు ఉన్న బండరాళ్ల తొనే దారి ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం రహదారి పనులు పూర్తి కావస్తుం డగా.. పనులు వేగంగా జరుగుతున్నాయి. గుట్టపై 50 గుడారాలు ఏర్పాటు చేసి వాటి ముందు భాగంలో పర్యాటకులను ఆకర్శించే విధంగా క్రాఫ్ట్ ఫైర్ (కట్టెలతో మంటలు) ఏర్పాటు చేయనున్నారు. రామప్ప సరస్సు సమీపంలోని వరహాల గుట్ట పర్యాటకంగా విరాజిల్లానుండటంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


వరహాల గుట్టపైకి వేస్తున్న కాలిబాట

సరస్సు నుంచి గుట్టపైకి రోప్‌వే ఏర్పాటు చేయాలి

పూల్యాల రామన్న, టూరిజం మార్కెటింగ్ ప్రచారకర్త



కాకతీయుల చరిత్రతో పాటు మనకు అంతు చిక్కని బోలెడు విషయాలు వరహాల గుట్ట పైభాగం లోనే కాలగర్భంలో కలిసిపోతున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు చుట్టుపక్కల జిల్లాలోనూ ఈ వరహాల గుట్ట గురించి కొందరికి మాత్రమే తెలుసు. ప్రభుత్వం, పురావస్తు, పర్యాటక శాఖల అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుంటే అంతరించిపోతున్న కాకతీయుల చరిత్రను కాపాడటంతో పాటు భవిష్యత్ తరాలకు అందించే అవకాశం ఉంది. దీంతో పాటు గుట్టపైకి పర్యాటకులు వెళ్లేందుకు రామప్ప సరస్సు నుంచి గుట్టపైకి రోప్‌వే ఏర్పాటు చేస్తే పర్యాటక శాఖకు, ప్రభుత్వానికి నిజంగానే 'వరాలు' కురుస్తాయి.

జీవంజి దీప్తి తొలి గురువు కన్నుమూత

- ఆమెలోని క్రీడాకారిణిని గుర్తించిన వెంకటేశ్వర్లు


వెంకటేశ్వర్లు (ఫైల్)

పర్వతగిరి, సెప్టెంబరు 5: పారాలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన జీవంజి దీప్తి తొలి గురువు అయిన బియ్యాని వెంకటేశ్వర్లు(55) అనారోగ్యంతో బుధవారం రాత్రి కన్నుమూశారు. రూరల్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ అధ్వర్యంలో పర్వతగిరి మండలం కల్లెడలో నిర్వహిస్తున్న పాఠశాలలో 2000 సంవత్సరం నుంచి 2018 వరకు వ్యాయామ ఉపాధ్యాయుడిగా సేవలందించారు. ఆ సమయంలో పాఠశాల విద్యనభ్యసిస్తున్న దీప్తిలో దాగి ఉన్న క్రీడాకారిణిని గుర్తించిన వెంకటేశ్వర్లు ప్రత్యేక శిక్షణనిచ్చారు. పాఠశాల, కళాశాలస్థాయిల్లో ఆయన ఇచ్చిన శిక్షణతోనే దీప్తి పలు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించింది. అనంతరం సాయ్ అకాడమీలో శిక్షణ పొందింది. కాగా, పీఈటీ వెంకటేశ్వర్లు నాలుగేళ్లుగా పక్షవాతంతో బాధపడుతూ తన స్వగ్రామమైన బయ్యారం మండలంలోని ఇర్సులాపురంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆరోగ్యం విషమించి బుధవారం రాత్రి మృతిచెందారు.

కదిలిస్తున్న దీప్తి మాటలు


వెంకటేశ్వర్లుతో దీప్తి (ఫైల్)

ఇటీవల ఒక టీవీ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో దీప్తి తన మొదటి కోచ్ అయిన వెంకటేశ్వర్లు గురించి ఆసక్తికరమైన విషయాలు వెల్లడించారు. 'వెంకటేశ్వర్లు సార్‌ది నిరుపేద కుటుంబం. నాలోని ప్రతిభను గుర్తించి ఆయన ఇచ్చిన ప్రత్యేక శిక్షణ నేను పలు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించగలిగా. ఒలింపిక్స్‌లో పాల్గొని మెడల్ సాధించిన తరువాత అది కళ్లారా చూసి చనిపోతానని సార్ అనేవారు' అంటూ దీప్తి ఆ ఇంటర్వ్యూలో తెలిపింది. కానీ యాధృచ్ఛికంగా నిజంగా ఆయన గతంలో దీప్తితో అన్నమాటలే నిజయమ్యాయి. దీప్తి పారాలింపిక్స్‌లో కాంస్యం గెలుచుకున్న మరుసటి రోజునే ఆయన కన్నుమూశారు. ఈ నేపథ్యంలో దీప్తి ఓ చానల్ ఇంటర్వ్యూలో మాట్లాడిన మాటలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. ఈ వీడియో చూసి పలువురు కన్నీటి పర్యంతమవుతున్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల స్వీకరణ


ఉత్తమ అధ్యాపక అవార్డు అందుకుంటున్న ప్రొఫెసర్ వెంకట్రామిరెడ్డి, కొంక అనురాధ, జి.వెంకటయ్య


డాక్టర్ ఎల్.కొమురారెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 5: వరంగల్, హనుమకొండ జిల్లాల నుంచి రాష్ట్ర స్థాయి పలువురు ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులు స్వీకరించారు. హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమంలో కొంక అనురాధ, పి.సంపత్‌కుమార్, జి.వెంకటయ్య, డాక్టర్ ఎల్. కొమురారెడ్డి తదితరులు గురువారం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులను స్వీకరించారు.

రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు అందుకున్న వెంకట్రామిరెడ్డి, వాసం శ్రీనివాస్


పి.సంపత్‌కుమార్

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ భైరు వెంకట్రామిరెడ్డి గురువారం హైదరాబాద్ రవీంద్రభారతిలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, మాజీ ఎంపీ కే. కేశవరావు, రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యాశాఖా ధికారులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.


అవార్డు అందుకుంటున్న డాక్టర్ వాసం శ్రీనివాస్

హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల కెమిస్ట్రీ అధ్యాపకుడు డాక్టర్ వాసం శ్రీనివాస్ రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డును గురువారం అందుకున్నారు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరిగిన గురుపూజోత్సవ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లుభట్టి విక్రమార్క, రాష్ట్ర బీసీ, రవాణాశాఖ మాత్యు లు పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, కళాశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన ఇతర ప్రముఖుల చేతుల మీదుగా అందుకున్నారు.

మట్కా నిర్వాహకుడిపై కేసు నమోదు

వరంగల్ క్రైం, సెప్టెంబరు 5: మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శాంతినగర్‌లో మట్కా నిర్వహిస్తున్న బండి రాజు నివాసంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. నిర్వాహకుడిని అదుపులోకి తీసుకుని అతడి వద్ద నుంచి రూ.32 వేలు స్వాధీనం చేసుకున్నారు. చిరువ్యాపారులను మోసం చేసి బెట్టింగ్ నిర్వహిస్తున్న బండి రాజును విచారణ నిమిత్తం మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించారు. మిల్స్‌కాలనీ పోలీసులు రాజుపై కేసు నమోదు చేసారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ కె.శ్రీధర్ ధృవీకరించారు.

వైన్‌షాపులో చోరీ

ధర్మసాగర్, సెప్టెంబరు 5: ధర్మసాగర్ మండల కేంద్రంలోని వైన్స్ షాపులో గుర్తు తెలియని వ్యక్తులు గురువారం చోరీకి పాల్పడ్డారు. సిబ్బంది కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రంలోని శివ బాలాజీ వైన్స్‌షాపులో గురువారం తెల్లవారుజామున షాపునకు సంబంధించిన కిటికీలకు అమర్చిన గ్రిల్స్‌ను గడ్డపారల సహాయంతో దొంగలు తొలగించారు. ఆ తర్వాత షాపులోకి ప్రవేశించి కౌంటర్‌లో ఉన్న రూ.85,500తో పాటు రూ.2వేల విలువైన మద్యాన్ని అపహరించారు. షాపు యాజమాని శ్యాంసుందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విషజ్వరంతో యువకుడి మృతి


విజయ్ (ఫైల్)

కొత్తగూడ, సెప్టెంబరు 5: మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని గాంధీనగర్‌కు చెందిన ఓ యువకుడు విషజ్వరంతో గురువారం మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీనగర్ గ్రామానికి చెందిన మల్లెల విజయ్ (30) మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. గురువారం ఆయనకు జ్వరం తీవ్రత ఎక్కువ కావడంతో వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్సపొందుతూ విజయ్ మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడికి భార్య స్వర్ణ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా, విజయ్ వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు.

ప్రకృతి వ్యవసాయానికి కేంద్రం ప్రోత్సాహం



తాళ్లపూసపల్లిలో పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, వ్యవసాయ డ్రోన్‌ను ఆపరేట్ చేస్తూ పరిశీలిస్తున్న గవర్నర్

- ఈ విధానంలో సాగు కోసం రూ.1500 కోట్లు కేటాయింపు
- త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి
- కేసముద్రంలో సదస్సుకు హాజరు

కేసముద్రం, సెప్టెంబరు 5 : పర్యావరణాన్ని కాపాడుకుంటూ చేసే ప్రకృతి వ్యవసాయాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, ఈ విధానంలో సాగు కోసం రూ.1500 కోట్లు కేటాయించిందని, సహజసిద్ధ విధానంలో పండిన ఉత్పత్తులను ఆహారంగా తీసుకున్న వారు ఆరోగ్యంగా ఉంటారని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం తాళ్లపూసపల్లిలో గురువారం 'ప్రకృతి వ్యవసాయం'పై నిర్వహించిన సదస్సుకు ఆయన హాజరయ్యారు. తొలుత గవర్నర్‌ను కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన ఇంద్రసేనారెడ్డి తాళ్లపూసపల్లి, కల్వల గ్రామాల్లో స్వయం సహాయక సంఘాలకు 'నమోడ్రోన్ దీదీ' పథకంలో భాగంగా మంజూరైన వ్యవసాయ డ్రోన్‌ల పనితీరును పరిశీలించారు. ఆ తర్వాత అభినవ్‌రెడ్డి ఫౌండేషన్ బాధ్యుడు సొల్లేటి జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రకృతి వ్యవసాయ శిక్షణ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ గత వారంలో జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో రైతు సంక్షేమం కోసం కీలక నిర్ణయాలు తీసుకున్నారని, భూసారం వివరాలతో కూడిన 'భూమి ఆరోగ్య కార్డు'ను రూపొందించేందుకు నిర్ణయించిందని వివరించారు. ఇటీవల గుజరాత్‌లో నిర్వహించిన గవర్నర్ల సమావేశంలో ప్రధాని మోదీ చొరవతో ప్రకృతి సాగు విధానంలోని పంట ఉత్పత్తులతో వండిన భోజనాన్ని వడ్డించారని చెప్పారు. తాను పని చేస్తున్న త్రిపుర రాష్ట్రంలో కూరగాయల మొక్కల ఆకులను సైతం వంటల్లో వినియోగిస్తూ విక్రయిస్తున్నారని తెలిపారు. వ్యవసాయంలో పశువులను వినియోగించే కుటుంబాలు సంతోషంగా ఉంటాయని అన్నారు.

భూ తాపంతోనే వరదలు

ప్రకృతి వ్యవసాయ నిపుణుడు విజయ్‌రామ్

పెరిగిన రసాయన మందుల వినియోగం, వాతావరణ కాలుష్యం, భూ తాపంతోనే వరదలు, ప్రకృతి విపత్తులు వస్తున్నాయని, ఇది ఆరంభమేనని.. భవిష్యత్తులో ఇంకా ఇలాంటివి వస్తాయని ప్రకృతి వ్యవసాయ నిపుణుడు విజయ్‌రామ్ హెచ్చరించారు. ఈ సదస్సుకు శిక్షకుడిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సూక్ష్మపోషకాలు లేని ఆహారాన్ని తీసుకుంటున్నారని తద్వారా క్యాన్సర్, తదితర వ్యాధులు వస్తున్నాయని అన్నారు. ఏ జీవిని చంపకుండా అహింసా మార్గంలోనే ప్రకృతి వ్యవసాయ విధానం ఉంటుందని తెలిపారు. ప్రకృతి సాగు విధానంలో ఒక ఎకరంలో రూ.3 లక్షల ఆదాయాన్ని చూపుతానని వివరించారు. తాను పండించిన ఆహార ఉత్పత్తులతోనే తిరుపతిలో ప్రసాదం తయారు చేస్తున్నారని తెలిపారు.

ప్రకృతి ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలి

నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

ప్రకృతి విధానంలో పండించిన పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని సదస్సుకు హాజరైన నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కోరారు. 'నమో డ్రోన్ దీదీ' పథకంలో భాగంగా మహబూబాబాద్ జిల్లాకు మూడు వ్యవసాయ డ్రోన్‌లు ఇచ్చారని, తమ నర్సంపేట నియోజకవర్గంలోని మహిళా సంఘాలకు కూడా డ్రోన్‌లు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్‌డీవో అలివేలు, రాంమోహన్‌రెడ్డి, డీఏవో విజయనిర్మల, ట్రాన్స్‌కో డీఈ విజయ్‌కుమార్, తహసీల్దార్ టి.దామోదర్, ఏవో బి.వెంకన్న పాల్గొన్నారు.

వాయిదా పడిన ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ పరీక్షలు 9న

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 5: కాకతీయ యూనివర్సిటీ ఐదేళ్ల ఇండిగ్రేటెడ్ బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ పరీక్షలను సెప్టెంబరు 9న నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ పీఎస్ఎల్ సౌజన్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరు 2న జరగాల్సిన పరీక్షలు భారీవర్షాల కారణంగా వాయిదా పడిన విషయం విదితమే. ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, రెండో, నాలుగో సెమిస్టర్ పరీక్షలు గతంలో ప్రకటించిన షెడ్యూల్ మేరకు జరుగుతాయని వెల్లడించారు. పరీక్షల సమయంలో, పరీక్షల కేంద్రాల్లో ఎలాంటి మార్పులు లేవని స్పష్టం చేశారు.

పేకాట శిబిరంపై దాడి

వరంగల్ క్రైం, సెప్టెంబరు 5: కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోమ టిపల్లిలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు పేకాట శిబిరంపై దాడి చేసారు. గురువారం పేకాట శిబిరంపై దాడి చేసిన పోలీసులు రూ.31వేల నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, మూడు బైక్స్ స్వాధీనం చేసుకుని నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. అదుపులోకి తీసుకుని నలుగురిని విచారణ నిమిత్తం కేయూ పోలీసులకు అప్పగించారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ ఎస్.రాజు ధృవీకరించారు.

జూడో క్రీడాకారులకు చేయూత


క్రీడాకారులకు రవాణా చార్జీల టికెట్లను అందజేస్తున్న శ్రీనివాస్

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు 5: జూడో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సెప్టెంబరు 9నుంచి 12 వరకు చెన్నైలో నిర్వహించనున్న 4వ ఖేలో ఇండియా ఉమెన్స్ సబ్ జూనియర్స్, సీనియర్స్ సౌత్‌జోన్ టోర్నమెంట్‌లో పాల్గొననున్న జిల్లా జూడో క్రీడాకారులకు సీనియర్ క్రీడాకారుడు ఎల్.శ్రీనివాస్ రవాణాఖర్చులను అందించారు. వరంగల్ ఓ సిటీ క్రీడా మైదానంలో ఖేలో ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జూడో శిక్షణ కేంద్రాన్ని గురువారం శ్రీనివాస్ సందర్శించి క్రీడాకారులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలపై ఉన్న ఆసక్తితో ఒక సీనియర్ క్రీడాకారుడిగా ప్రతిభ కలిగిన పేద క్రీడాకారులకు చేయూతనందించేందుకు సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయన్నారు. ఖేలో ఇండియా ఆధ్వర్యంలో ఓసిటీ క్రీడా మైదానంలో శిక్షణ పొందుతున్న 10మంది క్రీడాకారిణులకు చెన్నైలో నిర్వహించనున్న సౌత్‌జోన్ పోటీలకు హాజరుకానున్న నేపథ్యంలో వారు క్రీడా పోటీలకు వెళ్లి రావడానికి రైల్వే రవాణా ఖర్చులను అందించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ డీవైఎస్‌వో సత్యవాణి, ఖేలో ఇండియా జూడో కోచ్ జె.లింగమూర్తి డీఎస్ఏ కోచ్‌లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎరుపెక్కిన టేకులగూడెం

- ముగిసిన మావోయిస్టు నేత మాచర్ల ఏసోబు అంత్యక్రియలు
- అంతిమయాత్రకు హాజరైన ప్రముఖులు
- ఇది బూటకపు ఎన్‌కౌంటర్ : భారతక్క

కాజీపేట, సెప్టెంబరు 5: ఎర్ర జెండాలతో టేకులగూడెం ఎరుపెక్కింది. ఎర్రజెండాల సాక్షిగా ఎన్‌కౌంటర్‌లన్నీ బూటకమే అంటూ ఫ్లెక్సీల ద్వారా ప్రజాసంఘాల నేతలు ఎండగట్టారు. ఎన్‌కౌంటర్లన్నీ ప్రభుత్వ హత్యలేనంటూ మానవహక్కుల సంఘాల నిలదీత పోస్టర్‌లు టేకులగూడెంలో దర్శనమిచ్చాయి. ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు మాచర్ల ఏసోబు అలియాస్ జగన్ అలియాస్ రణదేవ్ దాదా అంతిమ సంస్కారాలు గురువారం రాత్రి ముగిశాయి. ఉదయం ఏసోబు పార్థివదేహాన్ని స్వగ్రామమైన టేకులగూడెంకు కుమారుడు మాచర్ల మహేశ్ తీసుకువచ్చారు. గ్రామస్తులు,బంధువులు, మావోయిస్టు అభిమానులు, సానుభూతిపరులు తండోపతండాలుగా టేకులగూడెం వచ్చి ఏసోబు పార్థీవదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య, మాజీ ఎమ్మెల్యేలు ఆరూరి రమేశ్, దాస్యం వినయ్‌భాస్కర్, తెలంగాణ ఉద్యమకారుడు గాదె ఇన్నయ్య చేరుకుని ఏసోబు పార్థీవదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కళాబృందాలతో అంతిమయాత్ర

జోహార్ ఏసోబన్న.. ఏసోబన్న ఆశయాలను కొనసాగిద్దాం.. నీ త్యాగం మరువం.. అంటూ కళాబృందాలు, ప్రజాసంఘాల నేతల నినాదాలతో టేకులగూడెం హోరెత్తింది. ఏసోబు అంతిమయాత్ర గురువారం ఉదయం 11:30 నిమిషాలకు ప్రారంభమైంది. కళాకారులు ఆటలాడుతూ, పాటలు పాడుతూ భారీ ర్యాలీతో అంతిమయాత్ర సాగింది. ఎస్సీ కాలనీ నుంచి ప్రారంభమైన ఈ అంతిమయాత్ర.. గ్రామంలోని అన్ని కాలనీల మీదుగా సాగింది. సాయంత్రం 5:30 నిమిషాలకు విప్లవ సంప్రదాయం ప్రకారం నివాళులర్పించి దహన సంస్కారాలు నిర్వహించారు. ఏసోబు కుమారుడు మాచర్ల మహేశ్ దహన సంస్కారాలు పూర్తిచేశారు. కాగా, ఈ అంతిమ యాత్రలో ఇంటెలిజన్స్ పోలీసులు పాల్గొని అంతిమ యాత్ర జరిగిన తీరు, హాజరైన వారి వివరాలు సేకరించినట్లు సమాచారం.


అంతిమయాత్రలో పాల్గొన్న కుటుంబీకులు

బూటకపు ఎన్‌కౌంటరే..


ఏసోబు అంతిమయాత్రలో బూటకపు ఎన్‌కౌంటర్ల ఫ్లెక్సీతో పౌరహక్కుల నేతలు

ఏసోబుది కచ్చితంగా బూటకపు ఎన్‌కౌంటరేనని మాజీ మావోయిస్టు భారతక్క ఆరోపించారు. అంతిమయాత్రకు హాజరైన ఆమె మాట్లాడుతూ.. మావోయిస్టులను పట్టుకుంటే పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించాలని, కానీ హత్య చేయడం దారుణమన్నారు. ఈ బూటకపు ఎన్‌కౌంటర్‌ను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బంధుమిత్రుల కమిటీ జాయింట్ సెక్రటరీ శాంతక్క, పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాదన కుమార స్వామి, తెలంగాణ ప్రజా ఫ్రంట్ జనగామ జిల్లా అధ్యక్షుడు పాకాల వెంకన్నలు మాట్లాడుతూ.. ఆదివాసీలను, గర్భిణులను బట్టలూడదీసి కాల్చడం పోలీసుల పాశవిక చర్యలు అన్నారు. బొగ్గు, ఇనుము బహుళ జాతీయులకు అంటగట్టడానికి ఖగార్ ఆపరేషన్ పేరుతో ఏసోబును బూటకపు ఎన్‌కౌంటర్ చేశారన్నారు. ఎన్‌కౌంటర్‌లన్నీ కేంద్ర ప్రభుత్వం చేసే హత్యలేనన్నారు. మూడోసారి అధికారం చేపట్టిన మోదీ, నితీష్, చంద్రబాబు నాయుడు అండతోనే ఈ ఎన్‌కౌంటర్లు చేస్తున్నారన్నారు. ఇలాంటివి జరగకుండా ఇండియా కూటమి నేతలు కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. ఏసోబు ఎన్‌కౌంటర్‌పై సుప్రీం కోర్టు జడ్జితో విచారణ చేయాలని డిమాండ్ చేశారు.

తుది దశకు ట్రాక్ మరమ్మతులు

- ఇంటికన్నె వద్ద రెండు పట్టాలు సిద్ధం
- తెల్లవారుజామున డౌన్‌లైనుపై ట్రయల్‌రన్
- పాక్షికంగా రైళ్ల పునరుద్ధరణ.. కాషన్ ఆర్డర్‌తో రాకపోకలు

కేసముద్రం(మహబూబాబాద్ జిల్లా), సెప్టెంబరు 5: సికింద్రాబాద్-విజయవాడ సెక్షన్‌లోని మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కేసముద్రం-ఇంటికన్నె రైల్వే స్టేషన్ల మధ్య 418 కిలోమీటరు వద్ద వరద ప్రవాహానికి ట్రాక్ ధ్వంసమైన ప్రాంతంలో మరమ్మతు పనులు తుది దశకు చేరుకున్నాయి. చెన్నై-న్యూ ఢిల్లీ గ్రాండ్ ట్రంక్ లైనుగా పేరున్న ఈ ట్రాక్‌లో నాలుగు రోజులుగా కొనసాగుతున్న ఈ మరమ్మతు పనులు దాదాపు పూర్తయ్యాయి. బుధవారమే అప్‌లైన్ సిద్ధమవగా గురువారం తెల్లవారుజామున మూడు గంటల సమయానికి డౌన్‌లైను మరమ్మతులు పూర్తిచేసి ట్రయల్ రన్‌ను విజయవంతంగా నిర్వహించారు. దీంతో ఈ ప్రాంతంలో అప్ అండ్ డౌన్ లైన్లు రాకపోకలకు అందుబాటులోకి వచ్చాయి. ఉదయం నుంచి గోల్కొండ, కృష్ణా, ఈస్ట్‌కోస్ట్, అండమాన్, పద్మావతి ఎక్స్‌ప్రెస్‌లను అప్‌అండ్‌డౌన్ వైపుల నడిపించారు. అయితే మరమ్మతులు జరిగిన ప్రాంతంలో కాషన్ ఆర్డర్‌తో ఈ రైళ్లను నడపగా బుధవారం అప్‌లైనులో 5కిలోమీటర్ల వేగంతో వెళ్లగా, గురువారం 30 కిలోమీటర్ల వేగంతో వెళుతున్నాయి. ఇక తాజాగా అందుబాటులోకి వచ్చిన డౌన్‌లైనులో 5 కిలోమీటర్ల వేగంతోనే వెళుతున్నాయి. అయితే ఇక్కడ ట్రాక్ సిద్ధమైనప్పటికీ విజయవాడ రాయనపాడు ప్రాంతంలో రైల్వేట్రాక్ ముంపునకు గురి కావడంతో ఈ మార్గంలో పలు రైళ్లను నడపడంలేదని తెలుస్తోంది. శుక్రవారం నుంచి డోర్నకల్, భద్రాచలం రోడ్, మణుగూరు ప్రాంతాల నుంచి సికింద్రాబాద్, బల్లార్ష ప్రాంతాలకు నడిచే రైళ్లను పునరుద్ధరించనున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ఇంకా పూర్తిస్థాయిలో మరమ్మతుల కోసం రైల్వే సిబ్బంది ఈ ప్రాంతంలో పని చేస్తూనే ఉన్నారు. ఏదేమైనా వరద తాకిడికి పూర్తిగా తెగిపోయిన రైలుకట్టను నాలుగు రోజుల పాటు తీవ్రంగా శ్రమించి రెండు ట్రాక్‌లు అందుబాటులోకి తీసుకురావడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


ఇంటికన్నె వద్ద తెల్లవారుజామున డౌన్‌లైనులో ట్రయల్ రన్‌లో వెళుతున్న గూడ్స్


కేసముద్రం మండలం ఇంటికన్నె వద్ద మరమ్మతులు పూర్తి చేసుకొని సిద్ధమైన డౌన్ లైను

వరంగల్ మీదుగా పాక్షికంగా నడిచిన రైళ్లు

- నేటి నుంచి గోల్కొండ, శాతవాహన, ఇంటర్‌సిటీ

గిర్మాజీపేట, సెప్టెంబరు 5: భారీ వర్షాలు, వరదల కారణంగా ఇంటికన్నె-కేసముంద్రం, మహబూబాబాద్-తాళ్లపూసలపల్లి మధ్య ధ్వంసమైన రైల్వేట్రాక్‌ల పునరుద్ధరణ పనులు గురువారం ఉదయానికి పూర్తయి రైళ్ల రాకపోకలు కొనసాగుతున్నాయి. కానీ గురువారం విజయవాడ-సికింద్రాబాద్ మార్గంలో వరంగల్ మీదుగా రైళ్లు మాత్రం పాక్షికంగా నడిచాయి. సికింద్రాబాద్ - గుంటూరు, సికింద్రాబాద్-విజయవాడ మధ్య నడిచే గోల్కొండ, ఇంటర్‌సిటీ, శాతవాహన రైళ్లు రద్దవగా.. ఈ రైళ్లు శుక్రవారం నుంచి యథాతథంగా నడవనున్నాయి. ఇక విశాఖపట్టణం-మహబూబ్‌నగర్, విశాఖపట్టణం - నాందేడ్, తిరుపతి - సికింద్రాబాద్ కృష్ణా ఎక్స్‌ప్రెస్, గూడూరు - సికింద్రాబాద్ సింహపురి ఎక్స్‌ప్రెస్, తిరుపతి-కరీంనగర్ ఎక్స్‌ప్రెస్, తాంబరం-హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు గురువారం వరంగల్ మీదుగా వెళ్లాయి, అలాగే వరంగల్ మీదుగా వెళ్లాల్సిన కేరళ ఎక్స్‌ప్రెస్‌ను గురువారం కాజీపేట, సికింద్రాబాద్ మీదుగా దారి మళ్లించారు. అలాగే న్యూఢిల్లీ- చెన్నై, న్యూఢిల్లీ-విశాఖపట్టణం మధ్య నడిచే జీటీ, తమిళనాడు, ఏపీ ఏసీ రైళ్లను గురువారం రద్దు చేశారు. దూరప్రాంతాల నుంచి బుధవారం బయలుదేరిన కొన్ని రైళ్లు మాత్రమే గురువారం వరంగల్ మీదుగా వెళ్లాయి. శుక్రవారం నుంచి అన్ని రైళ్లు యథావిధిగా నడుస్తాయని గురువారం రాత్రి రైల్వే వర్గాలు వెల్లడించాయి.

వరంగల్ మార్కెట్ ధరలు

పంట	క్వింటా గరిష్ట	క్వింటా కనిష్ట
మక్కలు (బిల్టీరకం)	2945	2700
పల్లికాయ (సూక)	5100	4500
పల్లికాయ (పచ్చిది)	4500	3400
పెసళ్లు	6833	4552
పత్తి	7665	5000
పసుపు (కాడి)	12759	10000
పసుపు (గోల)	12009	10009
తేజ మిర్చి	12000	9000
తేజ ఏసీ	18000	14000
వండర్‌హాట్ ఏసీ	15200	13000
యూఎస్341 ఏసీ	14500	11000
దేశీ ఏసీ	22000	20000
తాలు మిర్చి	6000	3000

- వరంగల్ వ్యవసాయం

ధ్వంసమైన పైపులైన్ పనులు పూర్తి



కాశిబుగ్గ, సెప్టెంబరు 5: కాశిబుగ్గలో మంగళవారం అర్ధరాత్రి మెగా గ్యాస్ సంస్థ వారు ధ్వంసం చేసిన తాగు నీటిపైపలైన్ మరమ్మతులను కార్పొరేషన్ సిబ్బంది వేగంగా పూర్తిచేశారు. బల్దియా అధికారులకు సమాచారం ఇవ్వకుండా ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేయడంతో నీటి పైపులైన్ పగిలిన విషయం తెలిసిందే. ఈ కారణంగా కొన్ని ప్రాంతాలను నీటి సరఫరా నిలిచిపోయింది. కార్పొరేషన్ అధికారులు దగ్గరుండి పర్య వేక్షించి మరమ్మతులు వేగంగా పూర్తి చేశారు.

నగరంలో గంగవ్వ సందడి

శంభునిపేట, సెప్టెంబరు 5 : మై విలేజ్ షో ఫేమ్ గంగవ్వ, గీలా అనిల్‌లు నగరంలో సందడి చేశారు. ఖిలావరంగల్ మండలం బొల్లికుంట వద్ద రెస్టారెంట్, నెట్ క్రికెట్ క్లబ్ ప్రారంభోత్సవానికి గంగవ్వ టీమ్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. దావత్‌కు వచ్చి నెట్స్‌లో క్రికెట్ ఆడారు. విద్యార్థులు, స్థానికులు గంగవ్వతో ఉత్సాహంగా సెల్ఫీలు దిగారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఒగిశెట్టి యుగేందర్, పెద్దపల్లి భిక్షపతి, కందికొండ మోహన్, లయన్స్ క్లబ్ ఆఫ్ వరంగల్ వారియర్స్ అధ్యక్షుడు శేర్ల అనిల్ కుమార్, బేగ్, ఒగిశెట్టి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులకు జరిమానా

మట్టెవాడ, సెప్టెంబరు 5: మద్యం తాగి వాహనం నడిపిన కేసులో 21 మంది వాహనదారులకు జరిమానా, ఒక వాహనదారుడికి జైలుశిక్షను వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి విధించినట్టు వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపి ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడ్డ 21 మంది వాహనదారులకు రూ.30,800 జరిమానా, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన ముగ్గురు వాహనదారులకు రూ.2500 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ తెలిపారు.

1500 కిలోల భారీ లడ్డూ ఏర్పాటు

వరంగల్‌కల్చరల్, సెప్టెంబరు 5: గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని డిసోయిల్డ్ మార్కెటింగ్ సంస్థ, వారాహి ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో 1500 కిలోల లడ్డూను ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు, చార్టర్డ్ అకౌండెంట్ సూర్యదేవర క్రాంతి కుమార్ గురువారం తెలిపారు. గతేడాది సిద్దిపేటలో రూ.1.35 లక్షలకు లడ్డును వేలంలో కొన్నానని, అదే స్ఫూర్తితో నగరంలో పెద్ద లడ్డు తయారు చేయించినట్టు వెల్లడించారు. హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ వినాయకుడి వద్ద మాత్రమే 1500కిలోల లడ్డును ఏర్పాటు చేస్తారని, ఇప్పుడు తాము ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. లడ్డు తయారికి రూ.5లక్షల ఖర్చు అయిందని, భారీ ఇనుప ఇనుపజాలీని తయారు చేయించినట్లు తెలిపారు. వరంగల్ కాకతీయ టాకీస్ సమీపంలోని వినాయకుడిని ఏర్పాటు చేసి, స్వామివారికి లడ్డు నైవేద్యంగా సమర్పిస్తామన్నారు. లడ్డువద్ద స్కానర్‌ను ఏర్పాటు చేశామని, భక్తులు స్కాన్ చేయగానే వారి వచ్చేలా రూపొందించామని, నవరాత్రుల అనంతరం స్కాన్ చేసిన భక్తులకు ప్రసాదాన్ని ఉచితంగా అందిస్తామని వెల్లడించారు.



లడ్డూ తయారీలో పాల్గొన్న నిర్వాహకులు

గురుకులాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్

రాయపర్తి, సెప్టెంబరు 5:మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలను అదనపు కలెక్టర్ సంధ్యారాణి గురువారం సందర్శించారు. వసతి గృహంలోని గదులను, స్టాక్ రూమ్‌ను, వంటశాల, భోనాలను పరిశీలించారు. విద్యాబోధన, హాస్టల్ పరిశుభ్రతకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి వసతి గృహాలను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తోందని తెలిపారు. వసతి గృహాల్లో ఏమైన సమస్యలు ఉంటే తమ దృష్టికితీసుకురావాలన్నారు. వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సరిత తదితరులు పాల్గొన్నారు.



గురుకుల పాఠశాలను తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

ఘనంగా గురుపూజోత్సవం



ఎన్‌టీఆర్‌నగర్‌లో ఉపాధ్యాయులను సన్మానించిన నాయకులు



శివనగర్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులకు సన్మానం



కృష్ణకాలనీ ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న విద్యార్థులు

వరంగల్ సిటీ, సెప్టెంబరు 5: నగరంలోని 14వ డివిజన్ ఏనుమాముల ఎన్‌టీఆర్‌నగర్‌లో గురువారం గురుపూజోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని ప్రాథమిక పాఠశాల పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఆకాలనీ నాయకులు, గ్రామపెద్దలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అడుప మహేష్, ఈర్ల రాజేందర్, ఆర్యూర్ కుమార్, కొత్తపల్లి యాదగిరి, బుజగుండ్ల సంతోష్,బొల్లె సాంబయ్య, కిరణ్, అబ్దుల్లా పాల్గొన్నారు.

- శంభునిపేట: రంగశాయిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డి.సంపత్, అధ్యాపకులను విద్యార్థులు సత్కరించారు. లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో ప్రిన్సిపాల్ శేర్ల అనిల్‌కుమార్, ఉపాధ్యాయులను సత్కరించారు.
- ఖిలావరంగల్: శివనగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్(ఐవీఎఫ్) జాతీయ నాయకుడు గట్టు మహేష్ బాబు, జిల్లాశాఖ అధ్యక్షుడు పుల్లూరి మధు ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు. ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఐవీఎఫ్ ప్రతినిధులు గుమ్మడవెళ్లి సురేష్, వల్లాల శైలజ, దివ్వెల పూర్ణచందర్, విడియాల నూతన్, ప్రధానోపాధ్యాయులు గందె శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.
- గిర్మాజీపేట: శ్రీకృష్ణకాలనీ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గురుపూజోత్సవం నిర్వహించారు. ముందుగా సర్వేపల్లి చిత్రపటానికి భారతీయ స్టేట్‌బ్యాంక్ వరంగల్ చౌరస్తా మేనేజర్ చీఫ్ మేనేజర్ అరవిందకుమార్, కళాశాల ప్రిన్సిపాల్ శరధృతి పూలమాలలు వేశారు. అనంతరం ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్ అరవిందకుమార్ మాట్లాడుతూ ఆదిగురువు తల్లి అయితే జీవితాన్ని తీర్చిదిద్దే గురువు ఉపాధ్యాయుడన్నారు. అనంతరం ప్రిన్సిపాల్, అరవిందకుమార్, అధ్యాపకులను విద్యార్థులు సత్కరించారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారులు వనమాల, ప్రవళిక, అధ్యాపకులు హరికృష్ణ, శ్రీనివాసశర్మ, కరుణశ్రీ, షబానా, కవిత, మంజుల, హేమలత, విజయలక్ష్మి, కల్పన, మనోహర్, శ్వేత, స్వప్న పాల్గొన్నారు.
- కరీమాబాద్: నేటి విద్యార్థులో భావిభారత పౌరులని న్యూ కౌటిల్యాస్ సెయింట్ ఆమెన్ స్కూల్ కరస్పాండెంట్ కోడం శ్రీధర్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని కరీమాబాద్‌లోని స్కూల్లో గురుపూజోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను ప్రతీ విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కరస్పాండెంట్ శ్రీధర, హెడ్మాస్టర్ సబితను విద్యార్థులు సత్కరించారు.

వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

నర్సంపేట, సెప్టెంబరు 5 : మండలంలోని బాంజీపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. వెంకటరమణ గురువారం సందర్శించారు. ఆస్పత్రిలోని మందులను పరిశీలించారు. గ్రామాల్లో, తండాల్లో వైద్య శిబిరాలను నిర్వహించి ప్రజలకు వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని సూచించారు.వర్షాకాలంలో అంటువ్యాధులు, మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, మెదడువాపు, విరోచనాలు, జ్వరాలు వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నాయన్నారు. ఉద్యోగులు ఇంటింటి సర్వే నిర్వహించి జ్వరం వచ్చిన వారిని గుర్తించి పరీక్షలు చేసి వైద్యచికిత్సలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆస్పత్రి డాక్టర్ అరుణ చంద్ర, హెల్త్ సూపర్‌వైజర్ రామలింగయ్య, ఫార్మసిస్టు అరుణ పాల్గొన్నారు.



మందులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో వెంకటరమణ

- దుగ్గొండి: గ్రామాల్లో జ్వరాలపై సర్వే నిర్వహించాలని, వారికి తగు సూచనలు చేయాలని డీఎంహెచ్‌వో వెంకటరమణ డాక్టర్లను ఆదేశించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం డీఎంహెచ్‌వో సందర్శించి తనిఖీచేశారు. ఆస్పత్రిలోని రికార్డులు, పీహెచ్‌సీలోని మందులను పరిశీలించారు. గ్రామాల్లో ఎక్కువ మంది జ్వరాలకు గురవుతూ ఆస్పత్రులలో చికిత్సలు పొందుతున్నారన్నారు. ఎంత మంది జ్వరాల బారినపడ్డారో తెలుసుకొని చికిత్సలు చేయాలన్నారు. పల్లె దవాఖానా డాక్టర్లు వైద్య శిబిరాలు నిర్వహించి మందులు అందించాలన్నారు. వైద్య సిబ్బంది నిర్లక్ష్యం చేయకుండా గ్రామాలు తిరగాలన్నారు. డాక్టర్ కిరణ్‌రాజు, హెచ్‌ఈవో సాంబయ్య, హెచ్‌ఎస్ సులోమి, సిబ్బంది పాల్గొన్నారు.

శిథిలావస్థలో పీహెచ్‌సీ



సంగెం, సెప్టెంబరు 5 : ఆరోగ్య కేంద్ర భవనం శిథిలావస్థకు చేరి పెచ్చులూడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కాపులకనపర్తిలోని ఆరోగ్య కేంద్ర భవనం వర్షానికి కురుస్తూ, భవనం లోపలి భాగంనాని, పెచ్చులూడుతోందని సిబ్బంది వాపోతున్నారు. తాజా మాజీ సర్పంచ్ ఎర్రబెల్లి గోపాల్‌రావు గ్రామంలోని గ్రామ పంచాయతీ భవనాన్ని ఆరోగ్య కేంద్రానికి ఇచ్చి నూతన భవనం నిర్మించేందుకు నిధులను మంజూరు చేయించారు. పాత గ్రామ పంచాయతీ భవనాన్ని 8 నెలల క్రితం ఆరోగ్య ఉప కేంద్రం నిర్వహణ కోసం జిల్లా అధికారులకు అప్పగించారు. కొన్ని రోజులపాటు భవనంలో విధులు నిర్వర్తించిన వైద్య సిబ్బంది, భవనంలో సౌకర్యాలు లేవనే కారణంతో తిరిగి పాత భవనంలోకి మార్చారు. వర్షంకు భవనం కురుస్తున్నా అక్కడే విధులు నిర్వర్తిస్తున్నారు.

పరమేశ్‌కు డాక్టరేట్



శంభునిపేట, సెప్టెంబరు 5: రంగశాయిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్ర సహా ఆచార్యులుగా పని చేస్తున్న గొడిశాలపరమేశ్‌కు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి జంతుశాస్త్ర విభాగంలో డాక్టరేట్ లభించింది. డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. మధ్య తరహా రిజర్వాయర్లలో చేపల ఉత్పత్తి పెంపుదల, ఉన్న అవకాశాలు, సవాళ్లు, ఏ కేస్ స్టడీ ఆఫ్ రంగనాయకసాగర్, మిడ్‌మానేర్ డ్యాంపై ప్రొఫెసర్ రెడ్యానాయక్ పర్యవేక్షణలో సమర్పించిన పరిశోధన గ్రంథానికి పట్టా పొందారు.

అంగన్‌వాడీలో చేర్పించాలి

ఖిలావరంగల్, సెప్టెంబరు 5: చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కార్పొరేటర్ వెల్పు గొండ సువర్ణ-సురేష్ సూచించారు. గురువారం తూర్పుకోట కొత్తగడ్డలోని అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ తీగల కల్యాణి ఆధ్వర్యంలో పాలు, గుడ్లు, బాలామృతాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రాజమణి, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు బోయిన దూడయ్య, తల్లులు, బాలింతలు, ఆశా వర్కర్ పాల్గొన్నారు.

మట్టి వినాయకుల పంపిణీ



మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్

ఖిలావరంగల్, సెప్టెంబరు 5: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు మట్టివినాయకులనే పూజించాలని కార్పొరేటర్ వెల్పుగొండ సువర్ణ కోరారు. గురువారం తూర్పుకోటలో మంత్రి కొండా దంపతులు అందించిన మట్టి వినాయకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు బోయిని దూడయ్య, బ్లాక్ అధ్యక్షుడు బెడిద వీరన్న, మాజీ మార్కెట్ డైరెక్టర్ సంగరబోయిన చందర్, మాజీ డివిజన్ అధ్యక్షుడు అల్లం కేశవరాజు, బంగారి శ్రీను, అర్షం రాంబాబు, ఏసిరెడ్డి రమేష్, బోలుగొడ్డు శ్రీనివాస్, ఎల్లయ్య, రాజమల్లు, రాజు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



వైద్యశిబిరాన్ని సందర్శించిన డిప్యూటీ డీఎంహెచ్‌వో

ఖిలావరంగల్, సెప్టెంబరు 5: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులతోపాటు మలేరియా, డెంగ్యూ, విష జ్వరాల బారినపడకుండా జాగ్రత్తలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో గోపాల్‌రావు సూచించారు. గురువారం 38వ డివిజన్ కార్పొరేటర్ బైరబోయిన ఉమాదామోదర్‌యాదవ్ ఆధ్వర్యంలో ఖిలావరంగల్‌లో డెంగీ పాజిటివ్ బారినపడిన మధురిమను ఆరోగ్య పరీక్షలు చేసి మందులను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ మోహన్‌సింగ్, పీహెచ్‌సీ డాక్టర్ నరేష్ పాల్గొన్నారు.

చెరువులను చెరపట్టారు!

5వ పేజీ తరువాయి

గత ప్రభుత్వంలోని కీలక నేతల కనుసన్నుల్లోనే భారీగా ఆక్రమణలు జరిగాయనే ప్రచారం జరుగుతోంది. అలాగే వరంగల్ దేశాయిపేటలోని చిన్న వడ్డేపల్లి చెరువు 70.74ఎకరాల్లో విస్తరించి ఉంది. దీనిలో సుమారు 35 ఎకరాలకు పైగా చెరువు భూమి కబ్జాకు గురైందనే చర్చ ఉంది. చెరువును ఆక్రమించుకుని 329అక్రమ నిర్మాణాలు చేపట్టారు. వీటిలో కేవలం 8అక్రమ కట్టడాలనే అధికారులు కూల్చివేసి, 110 కట్టడాలకు సంబంధించి నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకొన్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇంకా 211అక్రమ నిర్మాణాలకు ఎలాంటి నోటీసులు ఇవ్వకపోవడం వెనుక మతలాబేంటన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అక్రమార్కుల్లో కొందరు రెవెన్యూ అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారని నిర్మాణాల్లో ప్రభుత్వ కార్యాలయాలు కూడా ఉన్నాయని అందుకే అధికారులు చిన్నవడ్డేపల్లి చెరువు ఆక్రమణపై దృష్టి పెట్టడం లేదనే విమర్శలు ఉన్నాయి. అంతేకాకుండా ఓ మాజీ ప్రజాప్రతినిధి అనుచరులే అధికంగా ఉండటంతో అక్రమ కట్టడాలపై అధికారులు ఫోకస్ చేయటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే కాజీపేట నిట్ వెనుకాల ఉన్న బంధం చెరువు సుమారు 65.20 ఎకరాల్లో విస్తరించి ఉంది. దాదాపు ఈ చెరువులో 366 నిర్మాణాలు చేపట్టినట్టు అధికారులు గుర్తించారు. అయితే కేవలం ఏడు అక్రమ కట్టడాలనే కూల్చివేసిన అధికారులు, మరో 125కట్టడాలకు నోటీసులు ఇచ్చారు. మిగతా 234 అక్రమ కట్టడాలపై ఎలాంటి చర్యలు లేకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. పేదలు నిర్మించుకున్న ఇళ్లను వదిలేసి, బడా బాబులు, నేతలు అక్రమించిన భూములనైనా కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే పైడిపల్లి శివారులో హనమాన్ జంక్షన్ సమీపంలోని కోట చెరువు 172.40 ఎకరాల్లో విస్తరించి ఉండగా, ఇందులో 70ఎకరాలకు పైగా కబ్జాకు గురైనట్టుగా గుర్తించారు. ఈ చెరువు భూముల్లో 150 అక్రమ కట్టడాలు నిర్మించారు. అధికారులు నాలుగు అక్రమ నిర్మాణాలను తొలిగించి, 50మందికి నోటీసులిచ్చారు. మిగతా 96అక్రమ నిర్మాణాలపై అధికారులు దాటవేత ధోరణిలో ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. గత ప్రభుత్వంలో కీలకంగా ఉన్న ఓ ప్రజాప్రతినిధితో పాటు మాజీ, తాజా కార్పోరేటర్లు కొందరు కీలకంగా వ్యవహరించారనే ప్రచారం ఉంది. ఇవే కాకుండా హనుమకొండలోని వడ్డేపల్లి చెరువు 556.32 ఎకరాల్లో విస్తరించి ఉండగా, దీనిలో 100 ఎకరాల వరకు భూమి ఆక్రమణకు గురైందని, చెరువు కట్టను అక్రమించుకుని హాల్స్, అపార్ట్‌మెంట్లు నిర్మించారని ఫిర్యాదులు అందినా అధికారుల మౌనమే చెరువుకు శాపంగా మారుతోందని చర్చ జరుగుతోంది. గత ప్రభుత్వంలో కీలక నేతతోపాటు హైదరాబాద్‌లోని ఓ మాజీ మంత్రి సహకారంతో కబ్జాకోరులు వందల కోట్ల భూముల్లో తిష్ట వేశారని తెలుస్తోంది. గోపాల్‌పూర్ చెరువు 16.11ఎకరాలకు పైగా ఉండగా, కేవలం రెండెకరాలు కూడా లేకుండా కబ్జాలకు దిగుతున్నారనే ఆరోపణలున్నాయి.

అలాగే ఉర్సు చెరువు, తిమ్మాపూర్ బెస్తం చెరువు, గొర్రెకుంట కట్టమల్లన్న చెరువు, రంగశాయిపేట చెరువులతో పాటు నగరంలోని, శివారులోని చెరువులు, కుంటల భూములను కబ్జారాయుళ్లు మింగేస్తున్నారనే ప్రచారం జరుగుతుంది.

ముంపు ప్రాంతాల్లో కొండా పర్యటన

బాధితులను ఆదుకుంటామని భరోసా

ఖిలావరంగల్, సెప్టెంబరు 5: లోతట్టు ప్రాంత ప్రజలు ధైర్యంగా ఉండాలని, బాధితులను ప్రభుత్వం తరఫున అన్ని విధాలా ఆదుకుంటామని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు అన్నారు. గురువారం 35వ డివిజన్ మైసయ్యనగర్‌లో ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన 150 మంది బాధిత కుటుంబాలకు 16రకాల నిత్యావసరాలను సొంత ఖర్చులతో అందించారు. కొండా మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడు అండగా ఉంటామన్నారు. వర్షాల కారణంగా ఇబ్బందులు పడిన ప్రజలకు సేవలందించిన నగరపాలకసంస్థ శాఖ, పోలీస్‌శాఖ, రెవెన్యూ సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్, టీపీసీసీ కార్యదర్శులు మీసాల ప్రకాశ్, నాయకులు గోపాలనవీన్‌రాజ్, ఎమ్డీ అయూబ్, కొత్తపెల్లి శ్రీనివాస్, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు రెణికుంట్ల శివ, నాయకులు శ్రీరాంరాజేష్, ఎస్.చందర్, సీహెచ్ సత్యం, రేణుక, పాల్గొన్నారు.

- మట్టెవాడ: వరద ముంపు బాధితులకు అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు హామీ ఇచ్చారు. హంటర్‌రోడ్‌లోని 28వ డివిజన్ ఎన్‌టీఆర్‌నగర్, బృందావన్‌కాలనీ, సాయినగర్ కాలనీలో వరద బాధితులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇక్బాల్, కాంగ్రెస్ నాయకులు నవీన్‌రాజ్, తోట హరీష్, ఓని భాస్కర్, చిట్టిమల్ల రమేశ్ పాల్గొన్నారు.
- కాశిబుగ్గ: భూములు కబ్జా చేస్తే ఎంతటి వారైన సహించేది లేదని కొండా హెచ్చరించారు. కాశిబుగ్గ ఎస్సార్ నగర్‌లోని దుస్సాకుంట కబ్జా చేస్తున్నారని స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తహసీల్దార్ ఇక్బాల్ నుంచి కుంట వివరాలు తెలుసుకున్నారు. బతుకమ్మ పండగకు ఏర్పాట్లు చేయాలని కాలనీవాసులు కోరగా కొండా సానుకూలంగా స్పందించారు.
- కాశిబుగ్గ కాశీవిశ్వేశ్వర ఆలయంలో శివలింగానికి కొండా ప్రత్యేక పూజలుచేశారు. ఆలయంలో కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఓని స్వర్ణలత భాస్కర్, కమిటీ సభ్యులు కొమురయ్య, ముచ్చర్ల ప్రభాకర్, బోడకుంట్ల వైకుంఠం, సమ్మక్క, కాంగ్రెస్ నేతలు గోపాల నవీన్‌రాజ్, అంబి సాంబరాజు, మీసాల ప్రకాష్, మోతిలాల్ నాయక్, డివిజన్ అధ్యక్షుడు దాసరి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.
- ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా వరద ముంపునకు గురైన ఎస్ఎన్‌నగర్, డీకే నగర్, మైసమ్మనగర్ బాధితులకు కొండా నిత్యావసర సరుకులు అందించారు.



మైసయ్యనగర్ నిత్యావసరాలను అందజేస్తున్న కొండా



దుస్సకుంటలో స్థానికులతో మాట్లాడుతున్న కొండా

ఆలయ భూమి కబ్జాచేస్తే ఊరుకోం..: కొండా

కాశిబుగ్గ: శ్రీరంగనాథ స్వామి ఆలయ భూమి ఎవరైనా కబ్జా చేసినా, యత్నించినా ఊరుకోమని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి హెచ్చరించారు. గురువారం కాశిబుగ్గలోని రంగనాథ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులతో మాట్లాడి ఆలయ భూములపై చర్చించి, వాటిని కాపాడుతానని హామీ ఇచ్చారు. కబ్జాకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు వంగరి రవి, ప్రధాన కార్యదర్శి చిలుపూరు సురేష్, లీగల్ అడ్వయిజర్ సాంబారి ప్రభాకర్, కోశాధికారి సుల్తానా సమ్మక్క, అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు, రామచార్యులు పాల్గొన్నారు.



వరంగల్ రూరల్

గురుకులాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్



గురుకుల పాఠశాలను తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

రాయపర్తి, సెప్టెంబరు 5: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలను అదనపు కలెక్టర్ సంధ్యారాణి గురువారం సందర్శించారు. వసతి గృహంలోని గదులను, స్టాక్ రూమ్‌ను, వంటశాల, భోనాలను పరిశీలించారు. విద్యాబోధన, హాస్టల్ పరిశుభ్రతకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి వసతి గృహాలను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తోందని తెలిపారు. వసతి గృహాల్లో ఏమైన సమస్యలు ఉంటే తమ దృష్టికితీసుకురావాలన్నారు. వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సరిత తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



మందులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో వెంకటరమణ

నర్సంపేట, సెప్టెంబరు 5 : మండలంలోని బాంజీపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వెంకటరమణ గురువారం సందర్శించారు. ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న మందులను ఆయన పరిశీలించి డాక్టర్, సిబ్బందితో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో, తండాల్లో వైద్య శిబిరాలను నిర్వహించి ప్రజలకు వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని సూచించారు. వర్షాకాలంలో అంటువ్యాధులు, మలేరియా, డెంగీ. చికున్‌గున్యా, వెదడువాపు, రక్తవిరోచనాలు, నీళ్లవిరోచనాలు, జ్వరాలు వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నాయన్నారు. ఉద్యోగులు ఇంటింటి సర్వేనిర్వహించి జ్వరం వచ్చిన వారిని గుర్తించి పరీక్షలు చేసి వైద్యచికిత్సలు అందించాలని ఆదేశించారు. వేడినీటిని కాచి చల్లార్చి తాగాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి డాక్టర్ అరుణచంద్ర, హెల్త్ సూపర్‌వైజర్ రామలింగయ్య, ఫార్మాసిస్టు అరుణ, ఎల్‌టి సీవన్ తదితరులు పాల్గొన్నారు.

• గ్రామాల్లో జ్వరాలపై సర్వే నిర్వహించాలి

దుగ్గొండి : గ్రామాల్లో జ్వరాలపై సర్వే నిర్వహించాలని, వారికి తగు సూచనలు చేయాలని డీఎంహెచ్‌వో వెంకటరమణ డాక్టర్లను ఆదేశించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం డీఎంహెచ్‌వో సందర్శించి తనిఖీచేశారు. ఆస్పత్రిలోని రికార్డులు, పీహెచ్‌సీలోని మందులు తనిఖీ చేశారు. గ్రామాల్లో ఎక్కువ మంది జ్వరాలకు గురవుతూ ఆస్పత్రులలో చికిత్సలు పొందుతున్నారన్నారు. ఎంత మంది జ్వరాల బారినపడ్డారో తెలుసుకొని చికిత్సలు చేయాలన్నారు. పల్లె దవాఖానా డాక్టర్లు వైద్య శిబిరాలు నిర్వహించి మందులు అందించాలన్నారు. వైద్య సిబ్బంది నిర్లక్ష్యం చేయకుండా గ్రామాలు తిరగాలన్నారు. డాక్టర్ కిరణ్‌రాజు, హెచ్‌ఈవో సాంబయ్య, హెచ్ఎస్ సులోమి, సిబ్బంది పాల్గొన్నారు.

• గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు

చెన్నారావుపేట : మండలంలోని గురిజాల, ఉప్పరపల్లి, చెన్నారావుపేట, పుల్లయ్యబోడు, బాలునాయక్‌తండా గ్రామాల్లో గురువారం ఉచిత వైద్య శిబిరాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భగా డాక్టర్ సరోజ మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉం చుకోవాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా చూసుకోవాలన్నారు. జ్వరాలు రా కుండా జాగ్రత్తలను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ రామెల్, కీర్యానాయక్, సహజ, భవాని, యమున, సురేందర్, లింగమూర్తి, సారియా, శ్వేత, సరిత తదితరులు పాల్గొన్నారు.

రాయపర్తిలో చోరీ

రాయపర్తి, సెప్టెంబరు 5 : ఇంట్లో ఎవరు లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి చోరీ చేసిన సంఘటన మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. రాయపర్తి ఎస్ఐ శ్రవణ్ కుమార్ కథనం ప్రకారం... రాయపర్తికి చెందిన దాసరి రాంబాబు, మోర్పోజు రవిల ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. రాంబాబు కొన్ని రోజుల క్రితం భూమిని కొనుగోలు చేయగా, వారికి డబ్బులు కట్టేందు బయట రూ.50 వేలు అప్పు తీసుకువచ్చాడు. ఈ నెల 4న ఆయన కుమారుడికి జ్వరం రాగా అర్ధరాత్రి ఆస్పత్రికి వెళ్లగా, గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఉదయం స్థానికులు గమనించగా, ఇంటి తలుపులు పగలగొట్టి ఉండడంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో, వెంటనే ఇంటికి చేరుకుని చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ చేరుకుని విచారణ చేశారు. రాంబాబు ఇంటిలో రూ.50వేల నగదుతో పాటు అర తులం బంగారం దొంగలించగా, రవి ఇంట్లో విలువైన వస్తువులు లేకపోవడంతో వెనుతిరిగి వెళ్లిపోయినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

టీఎన్జీవోస్ మండల కమిటీ ఎన్నిక

వర్ధన్నపేట, సెప్టెంబర్ 5 : మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల సెంట్రల్ ఫోరం, టీఎన్జీవో సంఘానికి అనుబంధంగా వర్ధన్నపేట మండలస్థాయి కమిటీని గురువారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా పంతాంటి మురళీకృష్ణ(చెన్నారం)ప్రధానకార్యదర్శిగా జంగంపల్లి సురేష్(రామవరం), ట్రెజరర్‌గా నాగపురి అన్వేష్(కొత్తపల్లి), ఉపాధ్యక్షురాలిగా జ్యోతి(దమ్మన్నపేట), ఆర్గనేజర్‌గా ఆకుల పృథ్వీరాజ్(బొక్కలగూడెం), గౌరవ అధ్యక్షుడిగా ఎ.రామారావు (ఇల్లంద) ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీ కాల పరిమితి మూడేళ్ల ఉంటుందన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



నర్సంపేటలో రిటైర్డ్ టీచర్ కృష్ణారావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



అశోక్‌నగర్ కస్తూర్బాలో ..



నెక్కొండ ప్రైమరీ స్కూల్‌లో గురువులను సన్మానించిన విద్యార్థులు



వర్ధన్నపేటలో టీచర్‌ను సత్కరిస్తున్న చిన్నారులు

నర్సంపేట, సెప్టెంబరు 5 : డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలను ఆయా పాఠశాలల విద్యార్థులు శాలువాలతో సన్మానించారు. విజ్‌డమ్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని రిటైర్డ్ ప్రభుత్వ తెలుగు పండిట్ ఎంవి.కృష్ణారావుపు పాఠశాల డైరెక్టర్ జావేద్, కరస్పాండెంట్ సయ్యద్ జహంగీర్ శాలువాకప్పి సన్మానించారు. సమాజసేవకుడు బెజ్జంకి ప్రభాకర్‌ను కూడా సన్మానించారు. అక్షర పాఠశాల, బాలాజీపాఠశాల్లో ఉపాధ్యాయులను బాలాజీ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎ.రాజేంద్రప్రసాద్‌రెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో కోశాధికారి వనజ, పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.జ్యోతి, కర్యాదర్శి రాజేశ్వర్ రెడ్డి, ఏవో సురేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఆచార్యడి గ్రీకళాశాల ప్రిన్సిపాల్ జీజుల సాగర్‌ను కళాశాల విద్యార్థులు సన్మానించారు.

• ఖానాపురం : మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అశోక్‌నగర్ కస్తూర్బా గురుకుల పాఠశాలలో పాఠశాల ఎస్‌వో మేనక ఆధ్వర్యంలో రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. విద్యార్థులు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. బుధరావుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్, ఖానాపురం, మంగళవారిపేట, ధర్మరావుపేట, మనుబోతులగడ్డలోని ప్రభుత్వ పాఠశాలలో గురుపూజోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

• దుగ్గొండి : మండలంలోని వివిధ పాఠశాలలో గురుపూజోత్సవ వేడు కలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలోని ఉపాధ్యాయులను స్థానిక ఎస్సై నిలోజు వెంకటేశ్వర్లు వారి పోలీసు సిబ్బందితో పాఠశాలకు చేరుకొని ఘనంగా సన్మానించారు. మల్లంపల్లి ఉన్నత పాఠశాల, తిమ్మంపేట, మహ్మదాపురం, తొగర్రాయి, నాచినపల్లి పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానం చేశారు.కార్యక్రమంలోహెచ్‌ఎంలు రామస్వామి, భద్రమ్మ, వెంకటేశ్వర్లు, జ్యోతిలక్ష్మీ, కాళీదాసు ఉపాధ్యాయులు దేవేందర్, అజీజ్, అహ్మద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

• నెక్కొండ : సమాజానికి దిశాదశ నిర్దేశం చేసే గురుతర బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందని నెక్కొండ ప్రాథమిక పాఠశాల హెడ్మాస్టర్ జాన్‌నాయక్, అప్పల్‌రావుపేట హై స్కూల్ హెడ్మాస్టర్ కె.రవీందర్ అన్నారు. మండలంలోని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాల్లో గురుపూజోత్సవాన్ని ఘనంగా జరిపారు.

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. విద్యార్థులు ఉపాధ్యాయులను శాలువాలను సన్మానించి, జ్ఞాపికలను అందించారు. వారు మాట్లాడుతూ విలువలతో కూడిన ఉత్తమ సమాజ నిర్మాణంలో గురువుల బాధ్యతేకీలకమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రవన్‌కుమార్, భిక్షపతి, రవీంద్రనాథ్, గీత, రమేశ్, యాకయ్య. భూలక్ష్మి, దయాకర్, వెంక్రాజం, మాలతి, భారతి, బద్రు, రాజేందర్ పాల్గొన్నారు.

• నల్లబెల్లి : మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యా యులకు స్వీట్లు అందించి శాలువాలతో ఘనంగా సన్మానించారు. గురువులు నేర్పిన విద్యాబుద్ధులను గుర్తుచేసుకుంటూ వారి పాదాలకు నమస్కరించారు. అనంతరం సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

• పర్వతగిరి: ఉపాధ్యాయ దినోత్సవాన్ని మండలంలోని ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, పలువురు గ్రామస్థులు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

• చెన్నారావుపేట : మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని సిద్దార్థ గురుకుల విద్యాలయంలో విద్యాసంస్థల చైర్మన్ కంది గోపాల్‌రెడ్డి,ప్రధానోపాధ్యాయులు అండెం కర్ణాకర్‌రెడ్డిలు,కస్తూర్బాలో ఎస్‌వో జ్యోతి, మోడల్ పాఠశాలలో ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మీ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జక్కుల జగదీశ్వర్, మేడి రమేష్‌గౌడ్, కృష్ణమోహన్, వల్లా వేణు, గణేష్, నైనాల రాజు, గణేష్, కుమార్, పీఈటీ రాజు, పొన్నం రమేష్, అరే రాజు, కవిత, రోజారాణి, స్వప్న, కాచవరపు దివ్యజ్యోతి, స్రవంతి, రోజా, మౌనిక, సృజన స్వప్న పాల్గొన్నారు.

• వర్ధన్నపేట : భారతీయ సంస్కృతిలో గురువుల స్థానం ఎంతో విశిష్టమైనదని, సముచితమైనదని, గౌరవ ప్రదమైనదని వర్ధన్నపేట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాధు రమేష్ అన్నారు. సర్వపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన గురుపూజోత్సవంలో సర్వపెల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ఉపాధ్యాయులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మట్లాడుతూ తల్లిదండ్రుల తరువాత స్థానం గురువుదేనన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బ్యూలబ్రెటీస్, అనిత, రాజకుమారి, రహీం, సురేష్, సూల్తానా తదితరులు పాల్గొన్నారు.

• సంగెం : మండల వ్యాప్తంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాలలో పాఠశాల ప్రత్యేకాధికారి నీలిమా నేతృత్వంలో ఉపాధ్యాయురాళ్లను ఘనంగా సత్కరించారు.

• గీసుగొండ : మండలంలో గురుపూజోత్సవాన్ని నిర్వహించారు. వంచ నగిరి మోడల్‌స్కూల్లో స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు బోధించారు.

• వర్ధన్నపేట రూరల్ : మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మండలంలోని ఉప్పరపెల్లి, దివిటిపెల్లి, కడారిగూడెం, దమ్మన్నపేటగ్రామాల్లో ఘనంగా జరిగాయి.

వాగులు వంకలు దాటి.. వైద్య సేవలు



వట్టె వాగు మత్తడి దాటుతున్న ఆరోగ్య సిబ్బంది



మర్లబోడు తండాల్లో వైద్య సేవలు అందిస్తున్న ఆరోగ్య సిబ్బంది

నెక్కొండ, సెప్టెంబరు 5 : భారీ వర్షాల కారణంగా మండలంలోని వట్టివాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. చిన్నకొర్పోలు గ్రామ శివారు మర్లబోడు తండాల్లో గర్భిణి డెంగీ వ్యాధికి గురయ్యారు. పలువురు జ్వరాలతో ఇబ్బంది పడుతున్నారు. విషయం తెలుసుకున్న అలంకానిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది గురువారం వట్టివాగు మత్తడి ప్రవహాన్ని దాటుకుంటూ వెళ్లి వైద్య సేవలను అందించారు. ఈ తండాల్లో 60 కుటుంబాలు ఉండగా తండాకు వెళ్లాలంటే వాగు దాటాల్సిందే. అయితే తండాల్లో ఇప్పటికే మహిళ డెంగీతో బాధపడుతుండగా, అంటువ్యాధులు ప్రబలుతాయంటూ తండావాసులు భయాందోళనకు గురవుతుండడంతో, ఆరోగ్య సిబ్బంది తప్పని పరిస్థితుల్లో ఒక్కరి చేయి ఒక్కరు పట్టుకొని భయం భయంగా వాగు దాటారు. డెంగీ వ్యాధి సోకిన గర్భిణిని వైద్య చికిత్సకు గాను వరంగల్ సీకేఎం ఆస్పత్రికి తరలించారు. పలువురికి రక్త పరీక్షలు జరిపి మందులు ఇచ్చారు. తండాల్లో దోమల నివారణ మందులను స్ప్రే చేశారు. ఆరోగ్య సిబ్బంది వాగు దాటుతున్న సమయంలో నీటిప్రవాహం పెరిగితే ఇబ్బంది పడే వారంటూ, వాగు దాటి వైద్య సేవలు అందించిన డాక్టర్ అర్చన, ఆరోగ్య సిబ్బంది రమాదేవి, పద్మ, ప్రవళిక, ఆశా వర్కర్లు కల్యాణిని మండల అధికారులు, తండా వాసులు అభినందించారు.

బీసీ బాలికల కళాశాల హాస్టల్‌లో సీట్లు పెంచాలి

నర్సంపేట, సెప్టెంబరు 5 : నర్సంపేటలో బీసీ బాలికల కళాశాల హాస్టల్‌లో సీట్లను పెంచాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్లనరేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏబీసీడబ్ల్యూవో శంకరయ్యకు వినతి పత్రం అందజేశారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు నర్సంపేటలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో బీటెక్, బీఫార్మసీ, డిగ్రీ, పీజీ విద్యను అభ్యసించడానికి వస్తున్నారన్నారు. కార్యక్రమంలో శివకుమార్, జస్వంత్, మహేశ్ పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందించాలి

చెన్నారావుపేట, సెప్టెంబరు 5 : జిల్లాలో అధిక వర్షాలతో దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారాన్ని అందించాలని ఎంసీపీఐయూ జిల్లా కార్య దర్శి పెద్దరాపు రమేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంట నష్టం జరిగిన పంటలకు ప్రభుత్వం ఎకరాకు రూ.30వేల నష్టపరిహారం అందించాలన్నారు. కార్యక్రమంలో కన్నం వెంకన్న, మండల నాయకులు హత్యానాయక్, జన్ను సాంబయ్య, శ్రీను, గోర్మియా, కళావతి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతివనాలపై నిర్లక్ష్యం వద్దు : డీఎల్‌పీవో

చెన్నారావుపేట, సెప్టెంబరు 5: గ్రామాల్లోని పల్లె ప్రకృతి పట్ల నిర్లక్ష్యం వహించరాదని నర్సంపేట డీఎల్‌పీవో రాజీవ్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని లింగగిరి గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలోని పల్లె ప్రకృతి వనం, బృహత్‌పల్లె ప్రకృతి వనం, వన నర్సీలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఓటర్ల జాబితా వార్డుల వారీగా ఎమైనా సందేహాలు ఉంటే, ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 13న ఓటర్ల జాబితా ప్రదర్శన వార్డుల వారిగా ఉంటుందన్నారు

కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి

గీసుగొండ,సెప్టెంబరు 5: కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లను ఇస్తామన్న ఎన్నికల హామీని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయా లని ధర్మ సమాజ్‌పార్టీ (డీఎస్‌పీ) వరంగల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కేడల ప్రసాద్ డిమాండ్ చేశారు. 42శాతం బీసీలకు రిజర్వేషన్‌లు కల్పించాలని డిమాండ్‌తో గీసుగొండలో చాపర్తి కుమార్‌గాడ్గె చేస్తున్న నిరాహార దీక్షకు మద్దతు తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో డీఎస్‌పీ మండల అధ్యక్షుడు చిలువేరు రవి, చాపర్తి రాజు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ఖానాపురం, సెప్టెంబరు 5 : యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా ఉన్నత విద్యను అభ్యసించాలని ఎస్సై రఘపతి అన్నారు. వరంగల్ నగర పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్‌ఝా ఆదేశాల మేరకు బుధవారం రాత్రి దబీర్‌పేటలో జాగృతి పోలీస్ కళా బృందం ఆధ్వర్యంలో కళా ప్రదర్శన నిర్వహించారు.కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాబృందం ఇన్‌చార్జ్ ఏఎస్సై నాగమణి, విలియమ్, వెంకటేశ్వర్లు, రత్నయ్య. పాల్గొన్నారు.

ప్రభుత్వ సదుపాయాన్ని వినియోగించుకోవాలి

వర్ధన్నపేట రూరల్, సెప్టెంబరు 5 : నిరుపేద కుటుంబాలకు చెందిన వ్యక్తులు ప్రభుత్వం కల్పించిన కొత్త విద్యుత్ మీటరు సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని వర్ధన్నపేట ఏడీఈ కన్న రాజు సూచించారు. మండలంలోని ఇల్లందలో రూ. 825 కే విద్యుత్ మీటరు కనెక్షన్‌పై గురువారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

చెరువులను చెరపట్టారు!

(5వ పేజీ తరువాయి)

గత ప్రభుత్వంలోని కీలక నేతల కనుసన్నుల్లోనే భారీగా ఆక్రమణలు జరిగాయనే ప్రచారం జరుగుతోంది. అలాగే వరంగల్ దేశాయిపేటలోని చిన్న వడ్డేపల్లి చెరువు 70.74ఎకరాల్లో విస్తరించి ఉంది. దీనిలో సుమారు 35ఎకరాలకు పైగా చెరువు భూమి కబ్జాకు గురైందనే చర్చ ఉంది. చెరువును ఆక్రమించుకుని 329 అక్రమ నిర్మాణాలు చేపట్టారు. వీటిలో కేవలం 8 అక్రమ కట్టడాలనే అధికారులు కూల్చివేసి, 110 కట్టడాలకు సంబంధించి నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకొన్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇంకా 211 అక్రమ నిర్మాణాలకు ఎలాంటి నోటీసులు ఇవ్వకపోవడం వెనుక మతలాబేంటన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అక్రమార్కుల్లో కొందరు రెవెన్యూ అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారని నిర్మాణాల్లో ప్రభుత్వ కార్యాలయాలు కూడా ఉన్నాయని అందుకే అధికారులు చిన్నవడ్డేపల్లి చెరువు అక్రమణపై దృష్టి పెట్టడం లేదనే విమర్శలు ఉన్నాయి. అంతేకాకుండా ఓ మాజీ ప్రజాప్రతినిధి అనుచరులే అధికంగా ఉండటంతో అక్రమ కట్టడాలపై అధికారులు ఫోకస్ చేయటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే కాజీపేట నిట్ వెనుకాల ఉన్న బంధం చెరువు సుమారు 65.20ఎకరాల్లో విస్తరించి ఉంది. దాదాపు ఈ చెరువులో 366 నిర్మాణాలు చేపట్టినట్టు అధికారులు గుర్తించారు. అయితే కేవలం ఏడు అక్రమ కట్టడాలనే కూల్చివేసిన అధికారులు, మరో 125 కట్టడాలకు నోటీసులు ఇచ్చారు. మిగతా 234 అక్రమ కట్టడాలపై ఎలాంటి చర్యలు లేకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. పేదలు నిర్మించుకున్న ఇళ్లను వదిలేసి, బడా బాబులు, నేతలు అక్రమించిన భూములనైనా కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే పైడిపల్లి శివారులో హనమాన్ జంక్షన్ సమీపంలోని కోట చెరువు 172.40 ఎకరాల్లో విస్తరించి ఉండగా, ఇందులో 70ఎకరాలకు పైగా కబ్జాకు గురైనట్టుగా గుర్తించారు. ఈ చెరువు భూముల్లో 150 అక్రమ కట్టడాలు నిర్మించారు. అధికారులు నాలుగు అక్రమ నిర్మాణాలను తొలిగించి, 50మందికి నోటీసులిచ్చారు. మిగతా 96అక్రమ నిర్మాణాలపై అధికారులు దాటవేత ధోరణిలో ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. గత ప్రభుత్వంలో కీలకంగా ఉన్న ఓ ప్రజాప్రతినిధితో పాటు మాజీ, తాజా కార్పోరేటర్లు కొందరు కీలకంగా వ్యవహరించారనే ప్రచారం ఉంది. ఇవే కాకుండా హనుమకొండలోని వడ్డేపల్లి చెరువు 556.32 ఎకరాల్లో విస్తరించి ఉండగా, దీనిలో 100 ఎకరాల వరకు భూమి ఆక్రమణకు గురైందని, చెరువు కట్టను అక్రమించుకుని హాల్స్, అపార్ట్‌మెంట్లు నిర్మించారని ఫిర్యాదులు అందినా అధికారుల మౌనమే చెరువుకు శాపంగా మారుతోందని చర్చ జరుగుతోంది. గత ప్రభుత్వంలో కీలక నేతతో పాటు హైదరాబాద్‌లోని ఓ మాజీ మంత్రి సహకారంతో కబ్జాకోరులు వందల కోట్ల భూముల్లో తిష్ట వేశారని తెలుస్తోంది. గోపాల్‌పూర్ చెరువు 16.11ఎకరాలకు పైగా ఉండగా, కేవలం రెండెకరాలు కూడా లేకుండా కబ్జాలకు దిగుతున్నారనే ఆరోపణలున్నాయి. అలాగే ఉర్సు చెరువు, తిమ్మాపూర్ బెస్తం చెరువు, గొర్రెకుంట కట్టమల్లన్న చెరువు, రంగాశాయిపేట చెరువులతో పాటు నగరంలోని, శివారులోని చెరువులు, కుంటల భూములను కబ్జారాయుళ్ల మింగేస్తున్నారనే ప్రచారం జరుగుతుంది.

గణేష్ మండపాలకు అనుమతి తప్పనిసరి : ఎస్ఐ



ఎస్ఐ ప్రవీణ్‌కుమార్

వర్ధన్నపేట, సెప్టెంబరు 5 : గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేసుకునే ఉత్సవ కమిటీల వారు మండపాల ఏర్పాటుకు స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి అనుమతులు తప్పనిసరిగా పొందాలని వర్ధన్నపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రోడ్లపై, ప్రజలు నడిచే దారిలో ఇరుకైన వీధుల్లో విగ్రహాలను ఏర్పాటు చేయరాదని ఉత్సవ కమిటీలకు సూచించారు. మండపం వద్ద కనీసం ముగ్గురు వలంటీర్లు 24గంటల పాటు అందుబాటులో ఉండాలని అన్నారు. మండపంవద్ద ఉండే వలంటీర్ల పేర్లు పుస్తకంలో నమోదుచేసి ఉండాలని అన్నారు. మండపాలు ఏర్పాటు చేసే ముందు సౌండ్‌సిస్టం కోసం ఏసీపీ వద్ద అనుమతులు తప్పనిసరి తీసుకోవడంతో పాటుగా విద్యుత్ శాఖ వారి అనుమతి, ఇంటి యాజమనుల అనుమతులు తప్పనిసరిగా పొందాలన్నారు. మండపాలు నిర్మించే సమయంలో తగిన జాగ్రతలు పాటించి గాలివానలకు ఎలాంటి ఉబ్బందులు ఏర్పడకుండా చూసుకోవాలని అన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగే విధంగా సౌండ్‌సిస్టం ఏర్పాటు చేయకూడదన్నారు. గణేష్ మండపాలకు ఇరువైలా మండే పదార్థాలు ఉండకుండా జాగ్రత్తలు పాటించాలని, మండపాల వద్ద మద్యం సేవించడం, జూదం అడడం నిషేదమన్నారు. ఎవరైన నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏదైనా అత్యవసర పరిస్థితులలో 100కు డయల్ చేయాలని ఆయన కోరారు.

శిథిలావస్థలో పీహెచ్‌సీ



పెచ్చులూడిన పైకప్పు

సంగెం, సెప్టెంబరు 5 : ఆరోగ్య కేంద్ర భవనం శిథిలావస్థకు చేరి పెచ్చులూడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కాపులకనపర్తిలోని ఆరోగ్య కేంద్ర భవనం వర్షానికి కురుస్తూ, భవనం లోపలి భాగం నాని, పెచ్చులూడుతోందని సిబ్బంది వాపోతున్నారు. భవనం కూలుతుందో లేదో తెలియని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. తాజా మాజీ సర్పంచ్ ఎర్రబెల్లి గోపాల్‌రావు గ్రామంలోని గ్రామ పంచాయతీ భవనాన్ని ఆరోగ్య కేంద్రానికి ఇచ్చి నూతన భవనం నిర్మించేందుకు నిధులను మంజూరు చేయించారు. పాత గ్రామ పంచాయతీ భవనాన్ని 8 నెలల క్రితం ఆరోగ్య ఉప కేంద్రం నిర్వహణ కోసం జిల్లా అధికారులకు అప్పగించారు. కొన్ని రోజులపాటు భవనంలో విధులు నిర్వర్తించిన వైద్య సిబ్బంది, భవనంలో సౌకర్యాలు లేవనే కారణంతో తిరిగి పాత భవనంలోకి మార్చారు. వర్షంకు భవనం కురుస్తున్నా అక్కడే విధులు నిర్వర్తిస్తున్నారు. కొత్త భవనాన్ని కాంట్రాక్టర్ జనవరిలో అధికారులకు అప్పగించినా కాట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడంతో భవనం పూర్తి కాలేదు.

రెండు రోజుల్లో కొత్త భవనంలోకి మార్చుతాం

గోపాల్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో

గ్రామంలోని కొత్త (గ్రామపంచాయతీ భవనంలోకి) ఆరోగ్య ఉప కేంద్రంను మార్చుతాం. వర్షాకాలంలో గ్రామ ప్రజలకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటాం. నిర్లక్ష్యం చేసే వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం.

వర్షాలకు కూలిన ఇళ్లు

నర్సంపేట, సెప్టెంబరు 5: మండలంలోని రాజేశ్వరరావుపల్లెలో అయిదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆరు ఇండ్లు కూలిపోయాయి. ఇదే గ్రామానికి చెందిన కూసరి రాజేశ్వర్‌రావు, కీసరి సాంబయ్య, కూసరి ఇంద్రయ్య, కె.సాంబయ్య, గడ్డం ప్రభాకర్, బొజ్జ సంపత్ ఇండ్లు పూర్తిగా కూలిపోయి వారు నిరాశ్రయులయ్యారు. అలాగే బొజ్జ శంకర్‌కు చెందిన పాడిగేదె మృతి చెందింది. ఇండ్లు కూలిపోయిన బాధిత కుటుంబాలను ఆదుకోవాలని రాజేశ్వరరావు పల్లె వాసులు, కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర ప్రభత్వాన్ని, అధికారులను కోరుతున్నారు. పాడిగేదె చనిపోయి నష్ట పోయిన శంకర్‌కు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని వారు కోరారు.

కూలిన ఇల్లు పరిశీలన

ఖానాపురం : ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని కొత్తూరులో అమృత పెద్దకుమారస్వామి ఇల్లు కూలిపోవడంతో గురువారం పంచాయతీ కార్యదర్శి స్రవంతి దెబ్బ తిన్న ఇల్లును పరిశీలించారు. నివేదికలను తయారు చేసి ఉన్నతా ధికారులకు పంపిస్తామని తెలిపారు. అనంతరం గ్రామంలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన హెల్త్ క్యాంపును పరిశీలించా రు. సీజనల్ వ్యాధుల పట్ల గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కారోబారు యాకయ్య, ఏఎన్ఎం రజిత, సులోచన, సుమలత, సంధ్య పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి



రామచంద్రారెడ్డి (ఫైల్)

నల్లబెల్లి, సెప్టెంబరు 5 : పురుగుల మందు తాగి ఓ వృద్ధుడు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు కథనం ప్రకారం... మండలంలోని ఓల్లెనరసయ్యపల్లి గ్రామానికి చెందిన వృద్ధుడు చిట్యాల రామచంద్రారెడ్డి (70) 15ఏళ్ల క్రితం గుండెపోటుతో చనిపోయిన తన భార్య లక్ష్మమ్మను తలచుకుంటూ మనోవేదనకు గురయ్యేవాడు. జీవితంపై విరక్తి చెంది ఈ నెల 2వ తేదీన సాయంత్రం 7 గంటలకు ఇంటి ముందు ఉన్న కొట్టంలో పురుగుల మందు తాగాడు. గమనించిన తన కుమారుడు నర్సంపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి ద్విచక్రవాహనంపై తరలించాడు. మెరుగైన వైద్యం కోసం వరంగల్‌కు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. అనంతరం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లగా, చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు చిట్యాల ఉపేందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రశాంత్‌బాబు తెలిపారు.

విద్యార్థులకు డైరీల పంపిణీ

పర్వతగిరి, సెప్టెంబరు 5 : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో 80 మంది విద్యార్థులకు డైరీలను గురువారం అందించారు. ఈ సందర్భంగా డైరీలను మండల నోడల్ ఆఫీసర్ గాయపు లింగారెడ్డి ఆవిష్కరించి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ హెచ్‌ఎం పాక రమేష్‌బాబు, పీఎస్ హెచ్‌ఎం వెంకటరమణారెడ్డి, ఉపాధ్యాయులు లలితాదేవి, సుభాషిణి, రామస్వామి, నవీన్, ప్రసాద్, లలిత, కిషన్ తదితరులు పాల్గొన్నారు.